PRAJASAKTI Regd.No. APTEL/2019/78422

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Ananthapuramu, Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam and Ongole

సంపుటి : 07 సంచిక : 161 | అనంతపురం, శనివారం 7 జూన్ 2025 | 8 పేజీలు వెల : 5.50

Vol No | Ananthapuramu, Saturday 7 June 2025 | Rs

## నేడు ఉక్కపోత.. గరిష్ట ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య మహారాష్ట్ర నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని, ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న ఉక్కపోతతో పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం విజయ నగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతా రామరాజు, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఉక్కపోతతో పాటు గరిష్టంగా 40 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశముందని తెలిపింది. అలాగే రాష్ట్రంలో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని పేర్కొంది.



## టీమిండియా ఆటగాళ్లు ఇంగ్లండ్‌కు పయనం

**ముంబయి:** భారత క్రికెటర్ల చివరి బృందం ముంబయి విమానాశ్రయం నుంచి పయనమైంది. ఇంగ్లండ్ లయన్స్‌తో వార్మప్ మ్యాచ్‌లు ఆడేందుకు భారత ఆటగాళ్లలో ఎక్కువమంది ఇప్పటికే ఇంగ్లండ్‌కు చేరుకోగా.. మిగిలిన జట్టు సభ్యులు శుక్రవారం ఇంగ్లండ్‌కు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా భారతజట్టు ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) సర్కిల్‌లో భాగంగా భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే తొలి టెస్ట్ సిరీస్ ఇదే. లీడ్స్, ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్, లార్డ్స్, లండన్‌లలో ఈ టెస్ట్‌లు జరగనున్నాయి. ఇరుజట్ల మధ్య తొలి టెస్ట్ 20నుంచి లీడ్స్ వేదికగా ప్రారంభం కానుంది.

### మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

- 14 రోజుల అనంతరం ఏ క్షణమైనా సమ్మె
- ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

8

### ప్రతియేటా డిఎస్‌సి

- నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రాజెక్టు 'అ'
- విద్యాశాఖ మంత్రి లోకేశ్

2

### రేషన్‌కు బదులు నగదు వద్దు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

3



### నిరసన చేయడం పౌరుడి హక్కు!

- మద్రాసు హైకోర్టు

7

# గవర్నర్ల తీరు రాజ్యాంగ విరుద్ధం

### సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న గవర్నర్లు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ విమర్శించారు. రాజ్ భవన్‌లో భారతమాత చేత కాషాయ జెండాను మోయిస్తున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజ్ భవన్‌లో కాషాయ జెండాను మోస్తున్న 'భారత మాత' చిత్రంతో కార్యక్రమాన్ని నిర్వహించిన కేరళ గవర్నర్ చర్య చాలా దురదృష్టకరమని అన్నారు. 'గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి. ఆయన దానిని మర్చిపోకూడదు. ఆ పదవిలో కూర్చొని ఇలాంటి వివాదాస్పద కార్యక్రమాలను నిర్వహించకూడదు. ఆయన భారతమాతను, ఇతరులను వ్యక్తిగతంగా పూజించవచ్చు. కానీ గవర్నర్ కార్యాలయంలో అలా చేయకూడదు' అని బేబీ అన్నారు. అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని బహిర్గతం చేయడం లక్ష్యంగా మిగతా 7లో

### ఉగ్రవాదం, యుద్ధోన్మాదం, మత విద్వేషాలకు వ్యతిరేకంగా వారం రోజుల పాటు ప్రచారోద్యమం

7



# 'బనకచర్ల'కు హ్యామ్

### నెలాఖరులోపు టెండర్లు • ఖర్చులో 50శాతం రుణాలు • సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా భావిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును హ్యామ్ (హైబ్రిడ్-యాన్యుటీ) విధానంలో చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన జలవనరుల శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలాఖరు లోపు ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. టెండర్లకు సంబంధించి రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణుల పరిశీలన తదితర అంశాలు ఈ లోగా ముగియాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు 81,900 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా. దీనిలో 50 శాతం మొత్తాన్ని (రు.40,900 కోట్ల మొత్తాన్ని) ఇపి రుణంగా పొందాలని నిర్ణయించినట్లు ఈ సమావేశంలో సిఎం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంటుగా 20శాతం మొత్తం (రు.16,380 కోట్లు) సమకూరుస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. మరో20శాతం మొత్తాన్ని హ్యామ్ విధానంలో సేకరిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఈక్విటీగా 10శాతం (రు. 8,190 కోట్లు) ఖర్చు చేస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ పర్యావరణ అనుమతులు డిపిఆర్ ఆమోదం అన్నీ అనుకున్న సమయానికి జరగాలని, భూసేకరణకూ సిద్ధంగా ఉండాలని సిఎం సూచించారు. జలహారతి కార్పొరేషన్ కింద ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు వీలుగా స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**సాగుకాలంలో మార్పులు చేయాలి**

తుపాన్ల కంటే ముందుగానే పంట చేతికొచ్చేలా సాగుకాలంలో మార్పులు తీసుకు రావాలని అధికారులకు సిఎం సూచించారు. నీటి నిర్వహణ లోపాలు సరిచేసుకోవాలని, వాటర్ ఆడిట్ చేయాలని అన్నారు. రాయల సీమ, ఉత్తరాంధ్రతో సహా నిర్మించాల్సిన అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో మిగతా 7లో

### హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (హ్యామ్) ఇలా..




హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)అంటే ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇపిసి), బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బిఒటి) విధానాల కలయిక. ఈ విధానం కింద నిర్ణయించిన మొత్తంలో 40శాతం ఇపిసి పద్ధతిలోనూ, 60శాతం -బిఒటి యాన్యుటీ మోడల్‌లోనూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఢిల్లీ - ముంబాయి ఎక్స్‌ప్రెస్ వేని ఈ పద్ధతిలో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం యైన మొత్తం ఖర్చులో 40శాతాన్ని హ్యామ్ పద్ధతిలో సేకరించారు. 20 నుండి 25 శాతాన్ని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) భరించగా, మిగిలిన మొత్తాన్ని రుణం రుపంలో సేకరించారు. దాదాపుగా ఇదే పద్ధతిలో రాష్ట్రంలో బనకచర్ల ప్రాజెక్టు నిర్మించే అవకాశం ఉందని భావిస్తున్నారు. రోడ్డు ప్రాజెక్టు లో ప్రభుత్వమే టోల్ వసూలు చేసి ప్రైవేటు ఆపరేటర్లకు చెల్లిస్తోంది. బనక చర్ల ఖర్చును ప్రభుత్వం రైతుల నుండి వసూలు చేసి ప్రైవేటు ఆపరేటర్లకు చెల్లిస్తుందా? లేక వసూళ్ల బాధ్యతనునేరుగా ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగిస్తుందా అన్నది స్పష్టత రావాల్సిఉంది.

# 'తల్లికి వందనం' ఎప్పుడు?

- ఇంకా ఖరారు కాని విధివిధానాలు
- మరో ఐదు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఈ ఏడాది బడులు తెరిచేనాటికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తాం..' ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఇటీవల చేసిన ప్రకటనల సారాంశం. నేతలు పదేపదే చెబుతుండటంతో ఆ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో తప్పనిసరిగా మారిన ఖర్చుల భారం నుండి కొంత మేరకైనా ఊరట లభిస్తుందని ఆశించారు. ఆచరణలో ఈ ఆశలు నెరవేరడంపై అనుమానాలు నెలకొన్నాయి. మరో నాలుగైదు రోజుల్లో బడులు ప్రారంభం అవుతుండగా ఇంతవరకు ఈ పథకానికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేయలేదు. ఆర్థికశాఖకు కూడా ఈ పథకం అమలుకు ఎటువంటి సూచనలు అందలేదని సమాచారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో ఒకేసారి కాకుండా విడతల వారీగా ఈ పథకాన్ని అమలు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రి ఈ దిశలో సంకేతాలు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ ఏడాది ఒకేసారి 'తల్లికి వందనం' పథకం ఉండకపోవచ్చని, మూడు, నాలుగు దఫాలుగా అమలుచేసే అవకాశముందని చర్చ సాగుతోంది. ఎటువంటి మార్గదర్శకాలు ప్రభుత్వం నుండి రాకపోవడంతో, అవి వస్తే కానీ, తాము ఏమీ చెప్పలేమని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకం పాఠశాలలు తెరిచే నాటికి అమలవుతుందా? అమలుచేస్తే ఎలాంటి నిబంధనలు విధిస్తారు? ఒకేసారి అమలు చేస్తారా? విడతాల వారీగా అమలు చేస్తారా? అనే అనుమానాలు తల్లిదండ్రుల్లో నెలకొన్నాయి

**ఆంక్షలు తప్పవా...?**

గత వైసిపి ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి పథకంలో ఆదాయ పన్ను చెల్లించే వారిని, తెల్లరేషన్ కార్డు లేనివారిని, 300 యూనిట్ల విద్యుత్ వినియోగించేవారిని, కారు కలిగి ఉన్న వారిని, అర్బన్ ప్రాంతంలో 1000 చదరపు అడుగుల స్థలం ఉన్నవారిని మినహాయించిన సంగతి తెలిసిందే. 75శాతం హాజరు నిబంధనను కూడా అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు విధిస్తుందో తెలియాల్సి ఉంది. విద్యుత్ వినియోగం ఆధారంగా ప్రభుత్వ పథకాలకు పేదలను దూరం చేయడం సరికాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాదించారు. గత ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలే అమలు చేస్తారా? లేదంటే విద్యుత్ వినియోగం, కారు నిబంధనలు తొలగిస్తారా? అమలు చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది. విధివిధానాలను ఆర్థిక శాఖ విడుదల చేస్తుందని, తమ పరిధి కాదని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**అర్హులు 65లక్షలు**

నిబంధనలు రాకముందే వడబోత కార్యక్రమాన్ని విద్యాశాఖ చేపట్టినట్లు తెలిసింది. 2024-25 విద్యాసంవత్సరంలో 1 నుంచి ఇంటర్మీడియట్ వరకు రాష్ట్రంలో సుమారు 81 లక్షల మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరిలో ఈ పథకానికి సుమారు 65 లక్షల మంది అర్హులని విద్యాశాఖ తేల్చింది. వీరికి ఈ పథకం అమలు చేయడానికి సుమారు రూ.9600కోట్లు అవసరమని విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు లెక్కలు వేశారు. వైసిపి హయంలో ప్రతి ఏటా సుమారు 42-44లక్షల మంది విద్యార్థులను అర్హులుగా తేల్చి ఏటా రూ.6500కోట్లు ఖర్చుచేసింది.

**ఆధార్ కేంద్రాల వైపు ప్రజలు పరుగు**

ప్రభుత్వం నుంచి ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలు అధికారికంగా ఇప్పటికీ విడుదల కాలేదు. కానీ ఈ పథకం అమలు కావాలంటే విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాను ఆధార్ నెంబర్‌తో, ఎన్‌పిసిఐతో జూన్ 5వ తేదిలోపు లింక్ చేసుకోవాలనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో జరుగుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలు, బ్యాంక్, గ్రామ, వార్డు సచివాలయాలకు క్యూ కడుతున్నారు.

# వడ్డీ రేట్లు అర శాతం తగ్గింపు

- వరుసగా మూడోసారి ఉపశమనం
- నగదు నిల్వల నిష్పత్తికి కోత
- ఆర్‌బిఐ ఎంపిసిలో నిర్ణయం

**న్యూఢిల్లీ :** రిజర్వ్ బ్యాంక్ వరుసగా మూడో సారి వడ్డీ రేట్లకు కోత విధించింది. మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బిఐ మోనిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) సమీక్షలో కీలక రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా 5.50 శాతానికి చేర్చింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు, ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు చొప్పున వడ్డీ రేట్లను తగ్గించింది. మొత్తంగా రుణాలపై వడ్డీ ఒక్క శాతం మేర కోత విధించడంతో పాత, కొత్త గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణగ్రహీతలపై వడ్డీ భారం కొంత తగ్గనుంది.

ఆర్‌బిఐ ఎంపిసి భేటీ తర్వాత శుక్రవారం ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్ర మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ద్రవ్యోల్బణం స్థిరంగా తగ్గుతోందని, ప్రపంచ అనిశ్చితులు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జిడిపి 6.5 శాతం పెరగొచ్చని తెలిపారు. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నామని తెలిపారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్లు మల్హోత్ర తెలిపారు.

మరోవైపు బ్యాంక్‌ల వద్ద నగదు లభ్యతను పెంచడానికి నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్‌ఆర్)ను 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో సిఆర్‌ఆర్ 4 శాతం నుండి 3 శాతానికి తగ్గనుంది. దీన్ని సెప్టెంబర్ నుండి 25 బేసిస్ పాయింట్ల చొప్పున నాలుగు విడతలుగా అమలు చేయనున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలోకి దాదాపు రూ.2.5 లక్షల కోట్లు నగదు లభ్యతను పెంచనుందని అంచనా వేసింది. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరుకు వీలు కల్పించినట్లవుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి రూ.9.5 లక్షల కోట్ల ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చామని మల్హోత్ర తెలిపారు. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయన్నారు. దీంతో మరో 11 నెలల వరకూ దిగుమతులకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ దఫా వడ్డీ రేట్లలో పావు శాతం తగ్గింపు ఉండొచ్చని నిపుణులు అంచనా వేయగా.. ఎస్‌బిఐ మాత్రం అర శాతం కోత ఉండొచ్చని ముందస్తు భావించడం విశేషం.



## ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆరు కరోనా కేసులు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆరు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతున్న పలువురు కరోనా పరీక్షలు చేయించుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఐదుగురికి, తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు శుక్రవారం తేలింది. బాధితుల్లో ఇటీవల కేరళ నుంచి వచ్చిన ఇద్దరు నర్సులు, నెల్లూరు భక్తవత్సల్ నగర్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు, వెంకటాచలం మండలం అనేకపల్లి గ్రామానికి చెందిన యువకుడు, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన యువకుడు, గూడూరుకు చెందిన ఒకరు ఉన్నారు. వీరందరినీ అధికారులు హోం ఐసోలేషన్‌లో ఉంచారు. కరోనా కేసులు నమోదవడంతో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కార్తీక్ ఆదేశాల మేరకు నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో కరోనా ఐసోలేషన్ సెంటర్‌ను వైద్యాధికారులు ఏర్పాటు చేశారు.



## ఎయిమ్స్‌లో 25 లక్షలు దాటిన ఒపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంగళగిరిలోని ఎయిమ్స్ ఇప్పటి వరకూ 25 లక్షలకు పైగా అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించింది. వైద్య సేవల్లో ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించినట్లు ఎయిమ్స్ మీడియా విభాగం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఐదేళ్ల కిందట ఎయిమ్స్‌లో ఒపి సేవలు ప్రారంభించగా, ఇప్పటి వరకూ 2.5 మిలియన్లు దాటిందని, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఎయిమ్స్ అద్భుత విజయంగా నిలుస్తుందని వెల్లడించింది. ఎయిమ్స్‌లో వృత్తి నైపుణ్యం కలిగిన వైద్యులు.. లక్షలాది మంది రోగుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తూ విశ్వసనీయతకు కేంద్రంగా మారిందని పేర్కొంది.



## రాజ్యసభకు కమల్‌హాసన్ నామినేషన్

**చెన్నై :** ప్రముఖ నటుడు, మక్కల్ నీదిమయం (ఎంఎన్‌ఎం) పార్టీ అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడు సచివాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ హాజరై, కమల్‌కు మద్దతు తెలిపారు. కమల్ హాసన్ బుధవారమే నామినేషన్ వేయాల్సి ఉంది. తన తాజా చిత్రం 'థగ్ లైఫ్' గురువారం విడుదల కావడంతో, ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. ఆయన శుక్రవారం తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. కమల్ హాసన్‌తో పాటు డిఎంకెకు చెందిన మరో ముగ్గురు నేతలు కూడా రాజ్యసభకు నామినేషన్లు వేశారు. వీరిలో సిట్టింగ్ ఎంపీ, సీనియర్ న్యాయవాది పి విల్సన్, రోకియా మాలిక్, మాజీ ఎమ్మెల్యే శివలింగం ఉన్నారు. 2018లో ఎంఎన్‌ఎం పార్టీని స్థాపించడం ద్వారా తమిళనాడు రాజకీయాల్లో కమల్ హాసన్ ప్రవేశించారు. ప్రస్తుతం 'ఇండియా' బ్లాక్‌లో భాగస్వామిగా ఎంఎన్‌ఎం ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో డిఎంకె నేతృత్వంలో పోటీ చేసిన ఇండియా బ్లాక్ పార్టీలకు ఎంఎన్‌ఎం మద్దతు ప్రకటించి, ప్రచారం నిర్వహించింది. 2025 రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం పార్టీకి ఒక స్థానం కేటాయించేందుకు డిఎంకె అప్పట్లో అంగీకరించింది. అందులో భాగంగానే కమల్ హాసన్‌కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించారు.




## ఎలన్ మస్క్ స్టార్ లింక్ సేవలకు కేంద్రం అనుమతి

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు భారత ప్రభుత్వం అనుమతించింది. ఇక్కడ స్టార్ లింక్ సేవలకు తాజాగా టెలికం శాఖ లైసెన్స్‌ను జారీ చేసింది. ఆ సంస్థ దరఖాస్తు చేసుకున్న 15-20 రోజుల్లోనే ట్రయల్ స్పెక్ట్రమ్ మంజూరు చేస్తామని టెలికం శాఖ వర్గాలు తెలిపాయి. దీంతో ఈ లైసెన్స్ పొందిన మూడో కంపెనీగా స్టార్ లింక్ నిలిచింది. దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించడానికి యూటెల్ శాట్‌కు చెందిన వన్‌వెబ్, రిలయన్స్ జియో దరఖాస్తులకు టెలికం శాఖ ఇప్పటికే అనుమతించింది. అమెజాన్‌కు చెందిన కుయిపర్ ఇండియా కూడా లైసెన్స్ కోసం ఇప్పటికీ ఎదురుచూస్తోంది. భారత్‌లో వాణిజ్య కార్యకలాపాల లైసెన్సుల కోసం స్టార్ లింక్ 2022 నుంచి ప్రయత్నిస్తోంది. కానీ జాతీయ భద్రతా ఆందోళనలతో సహా పలు కారణాల వల్ల జాప్యం జరిగింది. స్టార్‌లింక్ సేవలు చాలా ఖరీదైనవిగా ఉండటం గమనార్హం.

## 82 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

### విశాఖ జిల్లా పెద్దిపాలెంలో రైస్ మిల్లులపై అధికారుల ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి- ఆనందపురం (విశాఖపట్నం)



పెద్దిపాలెంలోని శ్రీ బాలాజీ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విశాఖ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కలకలం రేపింది. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలోని రెండు రైస్ మిల్లులపై అధికారులు ఆకస్మిక దాడులు జరిపి 82,468 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి తొమ్మిది గంటల నుంచి శుక్రవారం ఒంటి గంట వరకూ రైస్ మిల్లుల్లో తనిఖీలు కొనసాగాయి. రహస్యంగా అందిన సమాచారం మేరకు భీమిలి ఆర్‌డిఒ కె.సంగీత్ మాథూర్ ఆదేశాల ప్రకారం ఆనందపురం తహశీల్దార్ పేర్ల శ్యాంప్రసాద్ ఆధ్వర్యాన ఈ దాడులు నిర్వహించారు. తొలుత శ్రీ సాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్లుకు అధికారులు చేరుకున్నారు. తనిఖీలు జరిపి 31,668 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని రీప్యాకింగ్ చేయడానికి సిద్ధంగా ఉంచిన 1,252 ఖాళీ గోనె సంచులను, రవాణా కోసం వినియోగిస్తున్న మహీంద్రా బొలెరో వ్యాన్‌ను, ఆటోను పట్టుకున్నారు. ఆ తర్వాత శ్రీ బాలాజీ మోడరన్ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించి 50,800 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 388 ఖాళీ గోనె సంచులను, రవాణా కోసం వినియోగిస్తున్న అశోక్ లేలాండ్ లారీని పట్టుకున్నారు. ప్రభుత్వ ముద్రలతో ఉన్న రేషన్ బియ్యాన్ని మళ్లీ ప్రాసెస్ చేసి బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విక్రయించేందుకు రైస్ మిల్లుల వారు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత మిల్లుల యజమానులు చెన్న రాజేష్, చెన్న రామారావు, రవాణా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం దొరకడంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## చల్లపల్లి రాజా కుమారుడు, మాజీ ఎంపి యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ కన్నుమూత

ప్రజాశక్తి - మోపిదేవి (చల్లపల్లి)


యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్

చల్లపల్లి రాజా కుమారుడు, మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ (86) కన్నుమూశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న తన స్వగృహంలో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య విశాలాక్షి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1967-71 మధ్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి) తరపున మచిలీపట్నం లోక్‌సభ సభ్యుడిగా పని చేశారు. చల్లపల్లిలోని ఎస్ఆర్‌వైఎస్‌పి జూనియర్ కళాశాలకు కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తూ విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. జమిందారీ వ్యవస్థలోనూ, ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ ప్రజలకు సేవ చేశారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తలుగా మోపిదేవి, శ్రీకాకుళం, పెదకళ్లేపల్లి, యార్లగడ్డ, శివగంగలోని ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధి, నిర్వహణలో శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ అడుగుజాడల్లో అంకినీడు ప్రసాద్, వారి సోదరులు విశేష కృషి చేశారు. అంకినీడు ప్రసాద్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం కృష్ణా జిల్లా చల్లపల్లిలోని చల్లపల్లి రాజా హైస్కూలుకు శనివారం తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం మచిలీపట్నం రోడ్డులోని శివగంగలో అక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

## 10 వరకు ఉచిత సీట్ల నమోదు

- సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేట్, అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించే ఉచిత సీట్ల నమోదు ప్రక్రియ రెండో దశను ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి తొలిదశ కింద 23,117 మందికి సీట్లు కేటాయించామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో దశలో కేటాయించిన విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 10వ తేదీ లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్లాలని పేర్కొన్నారు. రెండో విడత ఫలితాలను ఈ నెల 14వ తేదీన విడుదల చేసి సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణను ఈ నెల 21న ఖరారు చేస్తామని వెల్లడించారు.

# మరో ముంబయిలా విశాఖ

- 8 జిల్లాలతో విశాఖ ఎకనమిక్ రీజియన్
- ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వచ్చే ఏడేళ్లలో విశాఖపట్నాన్ని మరో ముంబయిలా తయారు చేయాలని, ఎనిమిది జిల్లాలతో కలిపి ఏర్పాటు చేసే విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో లక్ష ఎకరాల భూములను గుర్తించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో నీతి ఆయోగ్ సమావేశంలో విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌పై అధికారులతో శుక్రవారం చర్చించారు. పలు అంశాలపై ముఖ్యమంత్రికి అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని, 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్ నుండి జరగాలని అధికారులకు సూచించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఎఎస్ఆర్, మన్యం జిల్లాలో కలిపి ఏర్పాటు చేసే ఈ రీజియన్లో ఎకనామిక్ యాక్టివిటీ పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఇక్కడ 49 బిలియన్ డాలర్ల జిడిపి నమోదవుతోందని, 2032 నాటికి 20 లక్షల నుండి 24 లక్షల ఉద్యోగాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆరు పోర్టులు, ఏడు మ్యానుఫ్యాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, ఆరు సర్వీసు, 12 పర్యాటక హబ్‌లతో రీజియన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం 41 ప్రాధాన్యత ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందని అన్నారు. విశాఖ రీజియన్ ప్రణాళికలు అమలైతే ఏడేళ్లలో 7.5 లక్షల గృహాలు, 10 వేల హోటల్ రూములు, 20 వరకూ ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కళాశాలలు, 7000 ఆస్పత్రి బెడ్లు, 20 వేల హెక్టార్లలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాలు, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు సమకూరుతాయని వివరించారు. విశాఖపట్నం నుండి మూలపేట, కాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మించి వాటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించామని, నూతన పాలసీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తామని వివరించారు. వర్క్‌ఫ్రమ్ హోమ్, నాలెడ్జ్ ఎకానమీ, అవుట్‌సోర్సింగ్ విధానాలు అవలంబిస్తున్నామని వివరించారు. వీటితోపాటు స్టీలు, పెట్రో కెమికల్ హబ్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్‌టెక్, లేబర్ ఇన్సెంటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. వచ్చే ఏడేళ్లలో ఐటి రంగంలో నాలుగు లక్షల నుండి ఏడు లక్షల వరకూ ఉద్యోగాలు కల్పన జరిగేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రైల్వే ప్రాజెక్టులతోపాటు అదనంగా ఏడు కొత్త ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

### వైజాగ్ మెట్రోపై చర్చ

77 కిలోమీటర్ల వైజాగ్ మెట్రోపైనా చర్చించారు. అలాగే స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఎపి ప్రభుత్వం నీతి ఆయోగ్, ఐఎస్ఇజి ఫౌండేషన్ వద్ద ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పందం జరిగింది. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బిలియన్ యూనిట్ల నుండి 2035 నాటికి 163.9 బిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం ఉంటుందని, 2029 నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, 22 గిగావాట్లు పంప్డ్ స్టోరేజీ, 1.50 ఎంఎంపిటిఎ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేందుకు వీలుగా లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. క్లీన్ ఎనర్జీ రంగంలో ఇప్పటి వరకూ 5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనిద్వారా 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం, సిఎస్ విజయానంద్, ఐఎస్ఇజి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతియేటా డిఎస్‌సి

- నూరుశాతం అక్షరాస్యత కోసం ప్రాజెక్టు 'అ'
- విద్యాశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రతియేటా డిఎస్‌సి నిర్వహణ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా డిఎస్‌సి ప్రక్రియను అధికారులు ప్రారంభించారని అభినందించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి అత్యధికంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి చేపట్టామని, ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన అధ్యాయమని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఎపి మోడల్ ఎడ్యుకేషన్ తేవడమే తమ లక్ష్యమని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను కూడా విజయవంతంగా ప్రారంభించామన్నారు. ఉపాధ్యాయ బదిలీల చట్టం మేరకు పూర్తి పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్లు ఇస్తున్నామని వివరించారు. వయోజన విద్యలో రాష్ట్రం అట్టడుగున ఉన్న నేపథ్యంలో ఇకపై మిషన్‌మోడ్‌లో వయోజన విద్య కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అక్షర ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 15-59 ఏళ్ల వయసుగల వారిలో ఇప్పటికీ 81 లక్షల మంది నిరక్షరాస్యులుగా ఉండటంపై మంత్రి విస్మయం వ్యక్తం చేశారు. రాబోయే మూడేళ్లలో అక్షరాస్యతలో టాప్-3 రాష్ట్రాల్లో ఒకటిగా రాష్ట్రం ఉండాలని, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సప్లయి డిమాండ్‌కు అనుగుణంగా స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని, నైపుణ్యం యాప్‌ను అప్‌గ్రేడ్ చేయాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులకు సూచించారు. నైపుణ్యం పోర్టల్‌లో అభ్యర్థుల నమోదు, శిక్షణ, సామర్థ్య పరీక్ష, సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పన, పరిశ్రమల అనుసంధానం, పరిశ్రమల్లో ఖాళీల వివరాలు తదితర వాటిని పొందుపర్చాలని చెప్పారు. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం కేంద్రాలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యూనివర్సిటీల నుంచి విద్యార్థులు బయటకు వచ్చేటప్పటికే సరైన నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగం సాధించే దశకు చేరుకోవాలని తెలిపారు. ఖాళీగా ఉన్న యూనివర్సిటీల విసి పదవులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తిని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న జాయింట్ సర్టిఫికేషన్ ఆఫ్ డిగ్రీస్ (జెసిడి) నిబంధనలను సడలించే అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ్ భరత్ గుప్తా పాల్గొన్నారు. అనంతరం రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలలకు అందించే వివిధ రకాల కిట్లను మంత్రి పరిశీలించారు.

## సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

- ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర మహాసభలో కెఎస్ లక్ష్మణరావు
- నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ బందగీ సాహేబ్, కె ఉమామహేశ్వరరావు ఎన్నిక



రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎలు) సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కామ్రేడ్ మీసాల కృష్ణమూర్తి నగర్‌లో గట్టు వెంకన్న, షేక్ బందగీ సాహెబ్, టి త్రినాధరావు, వెంకటపతి అధ్యక్షవర్గంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం 4వ రాష్ట్ర మహాసభ శుక్రవారం జరిగింది. మహాసభలో కెఎల్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాలకులు మారుతున్నా విఆర్ఎల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం విఆర్ఎలను దగా చేసిందని తెలిపారు. వారికి న్యాయం చేస్తామని టిడిపి కూటమి నాయకులు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక టిడిపి కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. పేస్కేలు, జీతాలు, నామినీలను విఆర్ఎలుగా గుర్తించడం, ప్రమోషన్లు వంటి సమస్యల పరిష్కారానికి విఆర్ఒలు పోరాడాలని పిలుపునిచ్చారు. విఆర్ఎలతోపాటు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు గత రెండేళ్లుగా పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు నాయకత్వం పట్టుదలతో కృషి చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విఆర్ఎలు గత రెండేళ్లగా నిర్బంధాలను ఎదుర్కొని పోరాడుతున్నారని తెలిపారు. తొలుత సంఘం పతాకాన్ని నాయకులు గట్టు వెంకన్న ఆవిష్కరించారు. సిపిఎం మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి, మీసాల కృష్ణమూర్తి తదితర అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మహాసభలో ప్రజాసంఘాల నాయకులు సౌహార్ద సందేశాలు ఇచ్చారు.

### నూతన కమిటీ ఎన్నిక

సంఘం నూతన అధ్యక్షులుగా షేక్ బందగీ సాహెబ్ (పల్నాడు), ప్రధాన కార్యదర్శిగా కె ఉమామహేశ్వరరావు (రాష్ట్ర కేంద్రం), కోశాధికారిగా రవికుమార్ (అనకాపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గట్టు వెంకన్న (విజయనగరం), టి త్రినాథరావు (శ్రీకాకుళం), ఉపాధ్యక్షులుగా కృష్ణారావు (పార్వతీపురం మన్యం), సుబ్బన్న (తిరుపతి), సుబ్బారావు (పశ్చిమ గోదావరి), లచ్చన్న (నెల్లూరు), షేక్ మొగలాభి (బాపట్ల)ను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా షేక్ రహిమాన్ (తూర్పుగోదావరి), నాగేంద్ర (వైఎస్ఆర్ కడప), శేఖర్ (అల్లూరి సీతారామరాజు)తో పాటు 47 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.


అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్


ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

### పలు తీర్మానాలు ఆమోదం

మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. విఆర్ఎలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేలు అమలు చేయాలని, రూ.500 డిఎ జీతంలో కలపాలని, ఖాళీగా ఉన్న విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టుల భర్తీలో 70 శాతం పోస్టులను విఆర్ఎలకు కేటాయించాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, నైట్ డ్యూటీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది.

## ఎన్నికల హామీలను అమలు చేయండి

- ఎపి చేనేత రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

చేనేత పరిశ్రమను పరిరక్షించాలని, కార్మికులను ఆకలి చావుల నుండి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పల్నాడు జిల్లా ఫణిదంలో శుక్రవారం కట్టా శివదుర్గరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిందని, అటువంటి చేనేత పరిశ్రమపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. గత ప్రభుత్వం షెడ్ కార్మికులకు, సహకార సంఘాలతో నేత నేస్తున్న చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అమలు జరపలేదని అన్నారు. బడ్జెట్లో చేనేతకు కేటాయింపులైనా చేయలేదని వివరించారు. తాము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమని రక్షిస్తామని, జిఎస్‌టి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని, 200 యూనిట్లు ఉచిత కరెంటు అమలు జరుపుతామని టిడిపి కూటమి నేతలుగా ఎన్నికల ముందు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో చేనేత పరిశ్రమకు రక్షణ కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు బడ్జెట్లో రూ.2000 కోట్లు కేటాయించాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌కు జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకోవడానికి రూ.6 లక్షలు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ప్రయివేట్ సెక్టార్‌లోని చేనేత కార్మికులకు త్రిఫ్టి పండు స్కీం అమలు జరపాలని, పట్టు, జరీ నూరు ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని 40 శాతం రిబేట్ కొనసాగించాలని, చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కామర్తి రాజు, సహాయ కార్యదర్శులు డోకుపర్తి రామారావు, వాస గంగాధరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, బి కాలప్ప, కనక లక్ష్మన్న, గోరు రాజు, కౌతరపు వెంకటేశ్వరరావు, బూడిద జ్ఞానేశ్వర రావు, అనుముల వీర బ్రహ్మం, దీపాల సత్యానారాయణ గద్దె బాబు లు పాల్గొన్నారు.

Canara Bank
A Government of India Undertaking
ఎఆర్ఎమ్ -1 (2366) శాఖ, 2వ అంతస్తు, సర్కిల్ కార్యాలయం, స్పెన్సర్ టవర్స్, నం.86, ఎమ్‌జి రోడ్డు, బెంగళూరు-560001. టెలిఫోన్ నంబర్లు : 080-25310181, ఇ మెయిల్ : cb6298@canarabank.com

**స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు**
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) క్రింద)
**సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.**

రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కెనరా బ్యాంక్, బెంగళూరు ఎఆర్ఎమ్-1 (2366) శాఖకు తనఖా పెట్టిన/ఛార్జ్ చేయబడి క్రింద వివరించిన స్థిరాస్తులు కెనరా బ్యాంక్, బెంగళూరు ఎఆర్ఎమ్-1 (2366) శాఖ, యొక్క అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేయడమైనది. క్రింద పేర్కొన్న రుణగ్రహీతల నుండి బకాయి రికవరీ చేసుకునేందు "ఏది ఎక్కడ ఉన్నదో " "అది అక్కడ అలాగే " మరియు "ఏమైనా ఉన్నది" ప్రాతిపదికన 27.06.2025న విక్రయించబడును.

| క్ర. సం. | రుణగ్రహీత పేరు/ చర/ స్థిర అసెట్స్ వివరణ | విక్రయ నోటీసు ప్రకారం మొత్తం బకాయిలు | ఆస్తి పూర్తి వివరణ మరియు వివరాలు | వేలం తేది మరియు సమయం | రిజర్వు ధర మరియు ఇఎమ్‌డి | 1. బిడ్ వద్ద పెంపుదల విలువ 2. తనిఖీ తేది 3. అకౌంట్ నం. మరియు ఐఎఫ్ఎస్‌సి |
|---|---|---|---|---|---|---|
| 1. | 1. మెసెర్స్. జ్యోత్స్నా రెడ్డి హాస్పిటల్ ప్రైవేట్ లిమిటెడ్, మారుతి పటలప్ప కాంప్లెక్స్ నం.9, అక్షయ్ నగర్, టిసి పాల్య మెయిన్ రోడ్డు, కోవెదనహల్లి, బెంగళూరు-560016. 2. శ్రీ. డా.వై.రాఘవేంద్ర రెడ్డి, తండ్రి. వై.నారప్ప రెడ్డి, నం.308, హెచ్‌ఆర్‌బిఆర్ లే అవుట్, 1వ బ్లాక్, 8వ ఇ మెయిన్ రోడ్డు, కళ్యాణ్ నగర్, బెంగళూరు-560043. 3. శ్రీమతి. కె.ప్రమోద, తండ్రి. కె.రామచంద్రారెడ్డి, నం.12-3-790, జీసస్ నగర్, జయమణమ్మ కళ్యాణమండపం వద్ద, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001. 4. శ్రీమతి. ఎర్రగుంట హేమవతి, డో.నం.12-2-416, 3వ క్రాస్, హరిహర నగర్ పశ్చిమం, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001. 5. శ్రీమతి. కె.చెన్నకేశవమ్మ, భర్త. కె.రామచంద్రారెడ్డి, నం.12-3-790, జీసెస్ నగర్, జయమణమ్మ కళ్యాణ మండపం వద్ద, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001. 6. శ్రీ. కె.రామచంద్రారెడ్డి, తండ్రి. కె.ఓబి రెడ్డి, నం.12-3-790, జీసెస్ నగర్, జయమణమ్మ కళ్యాణ మండపం వద్ద, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515001. | 04.06.2025 నాటికి రూ. 13,91,80,011.78/- (పదమూడు కోట్ల తొంభై ఒక్క లక్షల ఎనభై వేల పదకొండు రూపాయల డెభై ఎనిమిది పైసలు మాత్రమే) తో తదుపరి వడ్డీ మరియు దానిపై ఛార్జీలు. | **ఆస్తి-1 :** ఎస్ఆర్‌డి మరియు ఆర్‌డి అనంతపురం, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నం.13, టి.ఎస్.నం.2074-1, బ్లాక్-ఎ, ప్లాట్ నం.3 వద్ద ఉన్న కమర్షియల్ భవనం తో పాటు షెడ్ బేరింగ్ డో.నం.13-3-367, 13-3-368, మూల్యాంకనం నం.1001049967. తూర్పు : ప్లాట్ నం.3 లో హబీబ్ ఖాన్ ప్లాట్ మరియు అఖిల బేగం మరియు ఇతరుల సైట్, దక్షిణం : ప్లాట్ నం.4, డి. ఫక్రుద్దీన్ టి పి నం.79/77 లో బ్లాక్ బి, పడమర : ఆర్‌టిసి కాంపౌండ్ గోడ, ఉత్తరం : 20 అ.లు. రోడ్డు. **ఆస్తి-2 :** ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లా, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, జీసస్ నగర్, ఎల్ పి నం.26/63, ప్లాట్ నం.7, ఎస్‌వై.నం.284/2, వార్డు నం.12 వద్ద ఆర్‌డి మరియు ఎస్ఆర్‌డి అనంతపురం పరిధిలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా వద్ద ఉన్న రెసిడెన్షియల్ భవనం. హద్దులు : తూర్పు : ప్లాట్ నం.12, దక్షిణం : కె.రామచంద్రారెడ్డికి చెందిన ప్లాట్ నం.7లో ప్లాట్ మిగిలిన విభజన, పడమర : 40 అ.లు. రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నం.6. కొలిచే మొత్తం 1728 చ.అ.లు. లేదా 193.6 చ.గ.లు. బి. ఆంధ్రప్రదేశ్, అనంతపురం జిల్లా, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, జీసస్ నగర్, ఎల్‌పి నం.26/63, ఎస్‌వై.నం.284/2, వార్డు నం.12 వద్ద అనంతపురం ఆర్‌డి మరియు ఎస్ఆర్‌డి పరిధిలోని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా లో ఉన్న రెసిడెన్షియల్ భవనం. హద్దులు : తూర్పు : ప్లాట్ నం.12, దక్షిణం : వి.వెంకటరామిరెడ్డి ఇల్లు, పడమర : 40 అ.లు. రోడ్డు, ఉత్తరం : కె.రామచంద్రారెడ్డికి చెందిన ప్లాట్ నం.7లో మిగిలిన విభజన, కొలత మొత్తం 1592 చ.అ.లు. లేదా 290.04 చ.గ.లు. పై అంశముల సంఖ్యలు మరియు పక్కనే ప్లాట్లు. శ్రీమతి. కె.చెన్నకేశవమ్మ మరియు శ్రీ.కె.రామచంద్రారెడ్డి నిర్మించబడిన ఇంటి బేరింగ్ డో.నం.12-3-790, మూల్యాంకనం నం.1001046170. | 27.06.025 & 10.00 A.M. to 10.30 A.M. | రిజర్వు ధర : రూ.4,16,50,000/- ఇఎమ్‌డి : రూ.41,65,000/- 26.06.2025న, సా.4.00 గం. లేదా అంతముందు రిజర్వు ధర : రూ.3,02,15,000/- ఇఎమ్‌డి : రూ.30,21,500/- 26.06.2025న సా.4.00 గం. లేదా అంతకు ముందు | (1) Rs.1,00,000/- (2) 26.06.2025 A/c No. 209272434 IFSC CNRB0002366 |

**ఇతర షరతులు మరియు నిబంధనలు :**

ఎ) వేలం/బిడ్డింగ్ వెబ్‌సైట్ https://banknet.com/ ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా మాత్రమే ఉంటుంది. బిడ్డర్లు ఇ-వేలం ప్రక్రియలో పాల్గొనే ముందు వివరణాత్మక నిబంధనల కొరకు వెబ్‌సైట్ ద్వారా వెళ్లాలని సూచించారు.
బి) అధీకృత అధికారితో ముందస్తు అపాయింట్‌మెంట్‌తో ఆస్తిని తనిఖీ చేయవచ్చు.
సి) ఆస్తి రిజర్వ్ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించబడుతుంది మరియు వేలం ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లు తమ ఆఫర్‌ను మరింత మెరుగుపరుచుకోవచ్చు.
డి) కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ శాఖ యొక్క ఆధీకృత అధికారికి అనుకూలంగా డ్రాఫ్ట్ చేయబడిన రిజర్వ్ ధరలో 10 శాతం ఇఎమ్‌డి కొరకు **కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్-1 (2366) శాఖ, బెంగళూరు, లేదా అకౌంట్ నం.209272434 ఐఎఫ్ఎస్‌సి కోడ్ : CNRB0002366, ఆన్‌లైన్ క్రెడిట్ అకౌంట్ కు (ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి/ఫన్డ్ ద్వారా బదిలీ) ద్వారా 26.06.2025న, సా.4.00 గం. లేదా అంతకు ముందు చేయవచ్చు.**
ఇ) ఉద్దేశించిన బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకం సర్టిఫికేట్ మరియు ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండాలి. డిజిటల్ సంతకానికి సంబంధించిన వివరాల కోసం దయచేసి సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్.పిఎస్‌బి అలియన్స్ (బ్యాంక్‌నెట్) ఇ మెయిల్ : **support.baanknet@psballiance.com** వద్ద సంప్రదించగలరు.
ఎఫ్) ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించిన తర్వాత, ఉద్దేశించిన బిడ్డర్లు క్రింది పత్రాలు/వివరాల కాపీలను **కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్-1 (2366) శాఖ, బెంగుళూరుకు** చేతి ద్వారా సమర్పించాలి.
i) ఇఎమ్‌డి అమౌంట్‌కి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్/పే ఆర్డర్. ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి ద్వారా చెల్లించినట్లయితే, యుటిఆర్ సంఖ్యతో రసీదు.
ii) పాన్ కార్డు, ఐడి ప్రూఫ్ మరియు చిరునామా రుజువు ఫోటో కాపీలు. అయితే, బిడ్ మొత్తంలో 25% బ్యాలెన్స్ మొత్తాన్ని చెల్లించే సమయంలో విజయవంతమైన బిడ్డర్ ఈ పత్రాలను ఒరిజినల్‌గా బ్యాంక్‌కి సమర్పించాలి.
iii) బిడ్డర్‌దారు ద్వారా సమర్పించాల్సిన బిడ్ ఫారం.
జి) ఉద్దేశించబడిన బిడ్డర్‌దారులు ఇ వేలం సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్. పిఎస్‌బి అలియన్స్ (బ్యాంక్ నెట్) ఇ మెయిల్ : **support.baanknet@psballiance.com** వద్ద సమర్పించాలి. విఫలమైన బిడ్డర్ ద్వారా డిపాజిట్ చేయబడిన ఇఎమ్‌డి వారికి తిరిగి చెల్లించబడుతుంది. ఇఎమ్‌డి ఎటువంటి వడ్డీని కలిగి ఉండదు.
హెచ్) విజయవంతం కాని బిడ్డర్ డిపాజిట్ చేసిన ఇఎమ్‌డి వారికి తిరిగి ఇవ్వబడుతుంది. ఇఎమ్‌డి పై ఎటువంటి వడ్డీ ఉండదు.
ఐ) పైన పేర్కొన్న విధంగా రిజర్వు ధర వద్ద వేలం ప్రారంభమవుతుంది. బిడ్డర్లు పైన పేర్కొన్న మొత్తానికి గుణకారాల్లో తమ వివిధ ఆఫర్లను మెరుగుపరుస్తారు. "ఆన్‌లైన్" వేలం ముగింపు వరకు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కంటే ఎక్కువ) సమర్పించిన బిడ్డర్లు విజయవంతమైన బిడ్డర్లుగా ప్రకటించబడతారు. సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ధృవీకరణకు లోబడి, విజయవంతమైన బిడ్డర్ యొక్క ఫేవర్‌లో అమ్మకం నిర్ధారించబడుతుంది.
జె) విజయవంతమైన బిడ్డర్ అతను/ఆమెను విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించిన వెంటనే, సేల్ ధరలో 25 శాతం (ఇప్పటికే చెల్లించిన ఇఎమ్‌డితో సహా) జమ చేయాలి మరియు సెక్యూర్ క్రెడిటార్ ద్వారా విక్రయం ధృవీకరించబడిన తేది నుండి 15 రోజులలోపు మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. విజయవంతమైన బిడ్డర్ అమ్మకపు ధరను చెల్లించడంలో విఫలమైతే, అతను చేసిన డిపాజిట్ ఎటువంటి నోటీసు లేకుండా ఆధీకృత అధికారి ద్వారా జప్తు చేయబడుతుంది మరియు ఆస్తి వెంటనే మళ్లీ అమ్మకానికి ఉంచబడుతుంది.
కె) వర్తించే విధంగా రవాణా ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ/జిఎస్‌టి, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, పన్ను బకాయిలు, ఇతర ఛార్జీలు, బకాయిలు మొదలైన అన్ని ఛార్జీలను విజయవంతమైన బిడ్డర్ మాత్రమే భరించాలి.
ఎల్) ఆధీకృత అధికారికి ఎటువంటి కారణం చెప్పకుండానే ఇ-వేలం యొక్క నిబంధనలు మరియు షరతులను వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి లేదా మార్చడానికి హక్కు ఉంది.
ఎమ్) ఇ-వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న బిడ్డర్లు ఇంటర్నెట్ యాక్సెస్ లేని పక్షంలో, వారు సంబంధిత సర్కిల్ కార్యాలయాన్ని లేదా కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్-1 (2366) శాఖను సంప్రదించవచ్చు, వారు సహాయక కేంద్రంగా అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.
ఎన్) తదుపరి వివరాలకు శ్రీ.రంజన్ కుమార్, చీఫ్ మేనేజర్, కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్-1 (2366) శాఖ, (9039609346) ఇ మెయిల్ ఐడి : **cb6366@canarabank.com** లేదా సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్.పిఎస్‌బి అలియన్స్ (బ్యాంక్ నెట్) ఇ మెయిల్ : **support.BAANKNET@psballiance.com** వద్ద సంప్రదించవచ్చు.

**ప్రత్యేక సూచన/జాగ్రత్త**

బిడ్డింగ్‌ను చివరి నిమిషాలు/సెకన్లలో బిడ్డర్లు వారి స్వంత ఆసక్తితో నివారించాలి. బిడ్డర్ లేదా విక్రేత నుండి ఏవైనా లోపాలు/వైఫల్యం (ఇంటర్నెట్ వైఫల్యం, పవర్ వైఫల్యం మొదలైనవి) జరిగినప్పుడు కెనరా బ్యాంక్ లేదా సర్వీస్ ప్రొవైడర్ గాని బాధ్యత వహించదు. అటువంటి ఆకస్మిక పరిస్థితిని నివారించడానికి, బిడ్డరుదారులు బ్యాకప్, విద్యుత్ సరఫరా మరియు అవసరమైన అన్ని ఏర్పాట్లు/ప్రత్యామ్నాయాలు చేయాలని అభ్యర్థించారు, తద్వారా వారు అటువంటి పరిస్థితిని తప్పించుకోగలుగుతారు మరియు వేలంలో విజయవంతంగా పాల్గొనగలరు.

తేది : 05.06.2025
ప్రదేశం : బెంగళూరు
సం/- అధీకృత అధికారి
కెనరా బ్యాంక్

## శాతవాహన కళాశాల కూల్చివేత

- బోయపాటి శ్రీనివాస్ పేరుతో వెలిసిన నోటీసు బోర్డులు
- వందల కోట్ల విలువైన సొసైటీ కబ్జాకు ప్రయత్నం
- ప్రభుత్వం అండతో ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటిపై ఆరోపణలు

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్

విజయవాడ నగరం నడిబోడ్డున గల ఎంతో చరిత్ర కలిగిన శాతవాహన కళాశాలను కూల్చివేశారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కళాశాల భవనాన్ని అక్రమంగా నేలమట్టం చేశారు. దీంతో కళాశాల వద్ద శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కూల్చివేతను నిరసిస్తూ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల ఆందోళనలు, పోలీసుల రంగ ప్రవేశం... ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు కళాశాల వద్ద చోటుచేసుకుంది. కళాశాల భవనాన్ని కూల్చివేయడమే కాకుండా బోయపాటి శ్రీనివాస అప్పారావు పేరుతో అక్కడ బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా కళాశాల యాజమాన్యం మధ్య విభేదాల కారణంగా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల కళాశాల ప్రిన్సిపల్ వంకాయలపాటి శ్రీనివాసరావును టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనుచరులు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. కళాశాలకు చెందిన సొసైటీ భూమిని కాజేయడానికి తనపై ఒత్తిడి తీసుకువచ్చారని కిడ్నాప్ చెర నుండి వచ్చిన తర్వాత ప్రిన్సిపల్ మీడియాకు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా కళాశాల భవనాలను బోయపాటి అప్పారావుకు చెందిన వారు నేలమట్టం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాల స్థలం తమకే చెందుతుందని చెప్పి భవనాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బోయపాటి శ్రీనివాస అప్పారావు పేరుతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. కూల్చివేత సమాచారాన్ని ఆలస్యంగా తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ప్రొక్లయినర్లతో కళాశాలను కూల్చివేసి నేలమట్టం చేశారు. తమకు ఎటువంటి కోర్టు ఉత్తర్వులూ అందలేదని పోలీసులు స్పష్టం చేశారు. విలువైన భూమిని కాజేయడానికి ప్రభుత్వ అండదండలతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### బోయపాటి శ్రీనివాస్, మరికొందరిపై కేసు

శాతవాహన కళాశాలను అక్రమంగా కూల్చివేయడమే కాకుండా పెద్దఎత్తున అల్లర్లకు పాల్పడ్డారని బోయిపాటి శ్రీనివాస్ అప్పారావు, డి.శ్రీకాంత్, వి శ్రీనివాసరావు, ఎం రమా సత్యనారాయణతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సూర్యారావుపేట సిఐ మహమ్మద్ అలీ మీడియాకు వివరించారు. సెక్షన్లు 324/క్లాస్ 5, 329/4 బిఎన్ఎస్ కింద వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### విద్యార్థి సంఘాల ఆందోళన

శాతవాహనా కళాశాల భవనాల కూల్చివేత దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్న కుమార్ అన్నారు. ఘటనా స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఇటీవల కళాశాల ప్రిన్సిపల్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురిచేయడాన్ని గుర్తు చేశారు. వందలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్లు, అధ్యాపకులు సర్వీస్ డాక్యుమెంట్లు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. ఈ కూల్చివేతకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కుమార్ స్వామి, నాయకులు షణ్ముఖ్ పాల్గొన్నారు. ఎఐఎస్ఎఫ్, వైఎస్ఆర్‌సి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చుట్టుగుంటలోని శాతవాహన కళాశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. యాజమాన్యానికి వత్తాసు పలికిన కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావును అడ్డుకున్నారు. దీంతో విద్యార్థి సంఘాల నేతలకు, ప్రిన్సిపల్‌కు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ధర్నాలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్, వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ప్రైవేటు సంస్థల దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పొగాకు రైతులను ఆదుకునే విషయంలో సిఎం ఇచ్చిన ఆదేశాల అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిర్చి రైతులకు ఇచ్చిన హామీలా బుట్టదాఖలు చేయొద్దని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు, అధికారులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పొగాకు, మామిడి, కోకో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర చెల్లించకుండా, పంటలను కొనుగోలు చేయకుండా ప్రైవేటు సంస్థలు రైతులను దగా చేస్తున్నాయన్నారు. కంపెనీల మోసాల నుంచి రైతులను కాపాడి పంటలను గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ.. రైతులు పెద్దయెత్తున ఆందోళన చేస్తున్నారని చెప్పారు. గురువారం గుంటూరులో వేలాది మంది పొగాకు రైతులు రైతు సంఘాల నాయకత్వంలో జిపిఐ కంపెనీ కార్యాలయాన్ని ముట్టడించారని తెలిపారు. ఈ క్రమంలోనే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించారన్నారు. జిపిఐ, అలయన్స్, ఎంఎల్, ఐటిసి, డక్కన్ కంపెనీలు గతేడాది పొగాకు క్వింటాకు రూ.18 వేలు చెల్లించగా, ఈ ఏడాది ధరలు తగ్గించి కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేలు చెల్లిస్తున్నాయన్నారు. గత రెండు నెలలుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి అచ్చెన్నాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు పొగాకు రైతులకు ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా సిఎం ఆదేశాల అమలుకు పటిష్టమైన విధివిధానాలు రూపొందించి, పొగాకు కంపెనీల మోసాలు, దోపిడీ నుంచి రైతులను కాపాడాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయకుండా మాటలకే పరిమితం అయితే ఈ నెల 15వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధనానికి రైతులు పూనుకోవాల్సి వస్తుందని తెలిపారు.

## 'షైనింగ్ స్టార్స్' విద్యార్థులు

- అత్యధిక మార్కులు సాధించిన వారికి అవార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'షైనింగ్ స్టార్స్' అవార్డులను అందించనుంది. ఇందుకు సంబంధించిన జిఓ 25ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం విడుదల చేశారు. ఈ అవార్డు కింద విద్యార్థులకు రూ.20 వేల నగదు, మెడల్‌తో పాటు సర్టిఫికెట్ అందిస్తారు. 2024-25 విద్యాసంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను ప్రతి మండలంలో ఆరుగురు చొప్పున ఎంపిక చేసింది. ఒసి, బిసి తరగతుల నుంచి ఇద్దరి చొప్పున, ఎస్‌సి, ఎస్‌టి తరగతుల నుంచి ఒక్కొక్కరి చొప్పున, 70 శాతం పైన మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థుల నుంచి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి చొప్పున ఎంపిక చేసింది. ఇంటర్మీడియట్‌లో 830కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రతి జిల్లా నుంచి 36 మందిని ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ కలిపి 26 జిల్లాల నుంచి 4,169 మందిని ఎంపిక చేసింది. ఈ నెల 9న ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు ఈ అవార్డులను అందించాలని పేర్కొంది. ఈ కార్యక్రమానికి అయ్యే ఖర్చును ఇంటర్మీడియట్ బోర్డు నిధుల నుంచి ఖర్చు చేయాలని వెల్లడించింది.

## 19న అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో: కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును ఈ నెల 19న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేస్తారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాస్కి 2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) స్కీమ్ కింద మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పవిత్ర గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయన్నారు. 127 ఏళ్ల చరిత్ర కలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని ఆధునీకరిస్తామన్నారు. హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్‌హాట్ క్రాఫ్ట్ బజారు, హ్యాగింగ్ గార్డెన్స్, హాలోగ్రామ్‌జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, అక్వేరియం టన్నెల్స్ ఏర్పాటుచేసి అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

# రేషన్‌కు బదులు నగదు వద్దు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన 'పేదల ఆహార భద్రతపై నగదు బదిలీ ప్రభావం' అనే అంశంపై చర్చా వేదికను విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నాగశివరాణి అధ్యక్షత వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేరళ తరహాలో 3 కార్డుల విధానం అమలు చేయాలన్నారు. అక్కడ ఇస్తున్న విధంగా లబ్ధిదారులకు 17 రకాల సరుకులు అందించాలన్నారు. రేషన్ మాఫియాకు ప్రధానంగా ఎమ్మెల్యేలే మూలకారకులని విమర్శించారు. మండలానికో ఏజెంట్‌ను నియమించుకుని రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమ రవాణా, రీసైక్లింగ్ వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వామపక్ష పార్టీలు చేసిన పోరాటాల ఫలితంగా 1955లో దేశంలో పిడిఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. సమాజంలో అసమానతలు నిర్మూలించనంత వరకూ రేషన్ పంపిణీని కొనసాగించాలన్నారు. రేషన్ పంపిణీని నిర్వీర్యం చేసే క్రమంలో నగదు బదిలీకి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. పిడిఎస్‌లో రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను విరమించుకోవాలని, 2013 ఆహార భద్రతా చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని, ఎండియు వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, చర్చా వేదికకు హాజరైన వారంతా ఆమోదించారు. ఈ అంశాలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన జులై 15వ తేదీలోపు జిల్లా స్థాయిలో చర్చా వేదికలు, 16 నుంచి 20వ తేదీల మధ్య సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కార్యాచరణను ప్రకటించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ.. రేషన్ పంపిణీలో లబ్ధిదారులు కోరుకున్న విధంగా డిపోలు, ఎండియు రెండు వ్యవస్థలతో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, ఐద్వా రాష్ట్ర నాయకులు శ్రీదేవి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎంఎల్ఎస్ పాయింట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె రాంబాబు, ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ నాయకులు ఎం వెంకట్ తదితరులు చర్చా వేదికలో పాల్గొని రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను విరమించుకోవాలనే అభిప్రాయాన్ని వెల్లడించారు.


కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను కలిసిన రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, ఎంపి పార్థసారధి

## నిర్మలమ్మతో రాష్ట్ర మంత్రుల భేటీ

ప్రజాశక్తి - గోరంట్ల (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వద్దనున్న నాసిన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర మంత్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలిసి నంది విగ్రహాన్ని, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాష్ట్ర సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# అదుపులో ఆరుగురు నిందితులు

- మైనర్ బాలిక అత్యాచార ఘటనలో కదలిక

ప్రజాశక్తి -అనంతపురం

సత్య సాయి జిల్లా రామగిరి మండలంలోని ఏడు గుర్రాల పల్లిలో మైనర్ బాలిక అత్యాచారం కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం .8వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను కొంతమంది యువకులు ప్రలోభపెట్టి భయపెట్టి కొన్ని రోజులుగా అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది .ఆ బాలిక గర్భం దాల్చిన తరువాత విషయం బయటకొచ్చింది.ఈ ఘటన వెలుగులోకి రాకుండా దాచిపెట్టే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వెలువతున్నాయి. అయితే విషయం బయటకి తెలియడంతో చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు. అత్యాచారానికి పాల్పడిన వారు ఎనిమిది మంది ఉన్నట్టు సమాచారం. ఇందులో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తుంది .ఈ ఘటనపై అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

**ఎవరున్నా వదిలిపెట్టేది లేదు: సిఐ శ్రీధర్**

బాలికపై అఘాయిత్యం జరిగిందన్న విషయం తెలియగానే గురువారం ఏడుగురాళ్ల పల్లిని సందర్శించామని శ్రీధర్ తెలిపారు .ఈ ఘటనలో భాగస్వాములైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని పేర్కొన్నారు.

**అభం శుభం తెలియని బాలిక విషయంలోనూ నీచ రాజకీయాలు :రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

అభం శుభం తెలియని మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగితే దానిపట్ల కూడా వైసిపి నాయకులు పాల్పడుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు ఇప్పటివరకు శవ రాజకీయాలే చేస్తూ వచ్చిన వారు ఇప్పుడు మైనర్ బాలిక విషయంలోనూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎవరు తప్పు చేసినా కులం మతం అన్నదానితో సంబంధం లేదని కఠినంగా శిక్షించాలని తాము కోరుతున్నట్టు తెలిపారు. పోలీసులు నిందితులను పట్టుకునే పనిలో ఉన్నారని చెప్పారు .జరిగిన ఘటనను వక్రీకరించే పద్ధతులు మానుకోవాలని హితవు పలికారు.

**దళితులపై జరుగుతున్న అఘూత్యాలపై మంత్రి స్పందించా : ఎస్సీ ఎస్టీ జేపసీ నాయకులు సాకే హరి**

దళిత బాలిక పై జరిగిన అత్యాచారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ స్పందించాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు సాకే హరి డిమాండ్ చేశారు హోంమంత్రిగా ఉన్న అనిత దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు పాలకులు మారిన దళితులపై అఘాయిత్యాలు ఆగడం లేదని విమర్శించారు మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


**AXIS BANK LIMITED**

రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, లోన్ సెంటర్, గ్రౌండ్ ఫ్లోర్, 16-6-238, 2వ వీధి, శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు-524001

**డిమాండ్ నోటీసు**

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 3తో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద)

ఏదైతే మీ, దిగువ పేర్కొన్న వ్యక్తుల అభ్యర్ధన పై, బ్యాంకుపేరున వివిధ ఆస్తులను తాకట్టుపెట్టి ఆర్థిక సహాయం రూపేనా సమయానుసారం వివిధ రుణ సదుపాయాల మంజూరు పొందియున్నారు. బ్యాంకు పేరున టైటిల్ డీడ్స్ హామీగా డిపాజిట్‌చేసి మీ చేత తాకట్టుపెట్టిన ఆస్తుల వివరాలు ఇందు దిగువ పేర్కొనబడినవి. ఆ విధంగా బ్యాంకుకు బకాయి పడిన డెట్ ను తిరిగి చెల్లించుటలో విఫలంచెందుట ద్వారా, **రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా**చే జారీచేయబడిన మార్గదర్శకాల ప్రకారం మీ ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. ఆ విధంగా బ్యాంకుకు బకాయిగా ఉన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ, ఇందు దిగువ పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసులు రిజిస్టర్డు పోస్టు ద్వారా పంపబడినవి కాని అవి తపాలా శాఖచేత వెనుదిరిగినవి, అందుకుగాను ఈ నోటీసు జారీచేయబడుచున్నది.

| క్ర. సం. | దరఖాస్తుదారు /సహ-దరఖాస్తుదారు/ హామీదారుల పేరు/ ఖాతా నెం. | బకాయి రూ.లలో | ఈక్విటేబుల్ తాకట్టు ఆఫర్‌చేసిన ఆస్తులు |
|---|---|---|---|
| 1 | 1) శ్రీ చామల రామలింగ రెడ్డి తండ్రి చిన్న కొండారెడ్డి, ఇ.నెం.3-71-ఇ, గన్నెవారి పల్లి కాలనీ, తాడిపత్రి టౌన్ &మండలం, అనంతపురం-515411. ఇక్కడ కూడా: శ్రీ చామల రామలింగ రెడ్డి తండ్రి చిన్న కొండారెడ్డి, ఇ.నెం.1/76, ముచ్చుమర్రి కొండాపురం-కడప-516444. 2) శ్రీ చామల విశ్వనాథ రెడ్డి తండ్రి చామల రామలింగ రెడ్డి, ఇ.నెం: 3-71-ఇ, గన్నెవారిపల్లి కాలనీ తాడపత్రి టౌన్ &మండలం, అనంతపురం-515411. **రుణ ఖాతా నెం: 920030034525331 & 920030034525360 డిమాండ్ నోటీసు తేదీ: 31-05-2025 ఎన్‌పిఏ తేదీ 05-04-2025** | అగ్రిమెంట్ టర్మినేషన్‌న బకాయిలు **05-04-2025** నాటికి **రూ.7,19,029/-** (రూపాయలు ఏడు లక్షల పంతొమ్మిది వేల ఇరవై తొమ్మిది మాత్రమే) ఈ మొత్తాలకు సంబంధించి **06.04.2025** నుండి తదుపరి వడ్డీతో **05.04.2025** వరకువడ్డీ ప్లస్ పెనల్ ఛార్జీలు కలిగి ఉన్నాయి) | అనంతపురం జిల్లా, తాడిపత్రి ఉప జిల్లా, తాడిపత్రి పరిధిలోకి, తాడిపత్రి మండలం, గన్నెవారిపల్లి పంచాయతీ, సర్వే నెం.864 & 866-ఎ, వార్డ్ నెం: 3, ప్లాట్ నెం: 1 & 2 (పార్ట్), డి.నెం:3-71-ఇ గల 308చ.గ.ల విస్తీర్ణంలోని నివాస ఆస్తి మొత్తం భాగం. ఇది పత్రం నెం: 823/2010, తేదీ: 27.01.2010, తాడిపత్రి ఎస్ఆర్ఓ ఆధారంగా శ్రీ. రామలింగారెడ్డి పేరున కలదు మరియు **సరిహద్దులు మరియు కొలతలు:** తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 58 అ.లు లేదా 17.69 మీటర్లు, తూర్పు నుండి పడమర - దక్షిణం వైపు: 68 అ.లు లేదా 20.74 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం-తూర్పు వైపు: 44 అ.లు లేదా 14.42 మీటర్లు, ఉత్తరం నుండి నైరుతి వైపు: 44 అ.లు లేదా 14.42 మీటర్లు, మొత్తం భూమి విస్తీర్ణం 308 చదరపు గజాలు. **సరిహద్దులు: తూర్పు:** 13 అ.ల వెడల్పు రాస్తా, **పడమర:** బి. చంద్ర శేఖరరెడ్డి స్థలం, **ఉత్తరం:** 20 అ.ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** నీలి ఆశాబి మరియు ఇతరులు స్థలం. పైన పేర్కొన్న సరిహద్దుల్లో 308 చ.గ.ల విస్తీర్ణంలోని ఆర్‌సిసి నిర్మాణాలు ఉన్నాయి, ఇందులో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు మొత్తం బిల్ట్ అప్ ఏరియా 3000 చ.అ.లు, మొత్తం కార్పెట్ ఏరియా 2400 చ.అ.లు మరియు మొత్తం అమ్మకానికి ఉన్న ప్రాంతం 3000 చ.అ.లు అన్ని వసతులు మరియు ఈస్‌మెంట్స్ హక్కులతో. |
| | 1) శ్రీ ఎస్.జహీనోద్దీన్ చందన్ తండ్రి ఎస్.ఫకురుద్దీన్, డి.నెం.7-135, అరెపేట, మడికశిర గ్రామం & మండలం మడికశిర, అనంతపూర్ జిల్లా-515301. 2) శ్రీమతి షేక్ మక్బుల్ జాన్ భర్త ఎస్. ఫకురుద్దీన్,డి.నెం. 7- 135, అరె పేట, మడికశిర గ్రామం & మండం, మడికశిర - అనంతపురం జిల్లా -515301. 3) షేక్ నీలోఫర్ జన్ చాందాన్ భకంత షేక్ పులమతి ఎండీ నసీన్ హుస్సేన్, డోర్ నెం.20-235, ప్రభాకర్ స్ట్రీట్, ఓల్డ్ టౌన్, అనంతపురం జిల్లా - 515001 **రుణ ఖాతా నెం: 921030051074013 & 921030051073997 డిమాండ్ నోటీసు తేదీ: 09-05-2025 ఎన్‌పిఏ తేదీ: 02-05-2025** | అగ్రిమెంట్ టర్మినేషన్‌న బకాయిలు **02-05-2025** నాటికి **రూ.64,31,696/-** (రూపాయలు అరవై నాలుగు లక్షల ముప్పై వెయ్యి ఆరు వందల తొంభై ఆరు మాత్రమే) ఈ మొత్తాలకు సంబంధించి **03.05.2025** నుండి తదుపరి వడ్డీతో **02.05.2025** వరకువడ్డీ ప్లస్ పెనల్ ఛార్జీలు కలిగి ఉన్నాయి) | మడికశిర గ్రామంలోని కమర్షియల్ ఆస్తి, సైట్ విస్తీర్ణం 1597.2 చ.గ.లు లేదా 33 సెంట్లు సర్వే నెం.443/3ఎ2, 443/2బి, 5వ వార్డు, మడికశిర నగర పంచాయతీ ఏరియా, మడికశిర మండలం, మడికశిర ఉప జిల్లా, హిందూపురం రిజిస్ట్రేషన్ జిల్లా, అనంతపురం జిల్లా. ఆస్తి పత్రం నెం.1786/2021 తేదీ:15.07.2021, ఎస్ఆర్ఓ మడకసిర ఆధారంగా ఎస్. జహీనోద్దీన్ వారి పేరునకలదు మరియు **సరిహద్దులు:కొలతలు:** ఉత్తరాన: **తూర్పు**- పడమర: 89 అ.లు, **దక్షిణాన: తూర్పు** -పడమర: 75 అ.లు, తూర్పున: ఉత్తరం- దక్షిణం 173 అ.లు, పడమర: **ఉత్తరం- దక్షిణం** 173 అ.లు. **సరిహద్దులు: తూర్పు:** దాత మిగిలిన భూమి, **దక్షిణం:** అఖిల జాన్ స్థలం, **పడమర:** మధుగిరి రోడ్డు, **ఉత్తరం:** దాత భూమి. 1597.2 చ.గ.లు లేదా 33 సెంట్ల విస్తీర్ణంలో ఆర్‌సిసి నిర్మాణాలతో కూడిన సరిహద్దులు, మొత్తం నిర్మించబడిన & అమ్మదగిన ప్రాంతం 4188.8 చ.అ.లు |

ఒకవేళ పై పేర్కొన్న వ్యక్తులైన మీరు ఈ నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు యొక్క నియమాలలో పైన చూపినట్లుగా తదుపరి వడ్డీ మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులుతో మీచేత బకాయిపడిన పై పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినచో, బ్యాంకు, సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద మరియు సదరు చట్టంలోని ఇతర వర్తించు నియమాలు అనుసరించి అన్ని లేదా ఏవేని అధికారాలను వినియోగిస్తుంది. చట్టం యొక్క ఏవేని ఇతర నియమాల క్రింద ఇది అవసరమైనట్లుగా అట్టి ఇతర చర్యలు లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించుటకు బ్యాంకుకుగల అధికారాలతో పక్షపాతం లేకుండా ఈ ప్రకటన జారీచేయబడినది.

తేది: 07-06-2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్


# డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి



కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

## జనరల్ నాలెడ్జ్ : కరెంట్ ఎఫైర్స్



### నదీ తీర నగరాలు

**1.న్యూయార్క్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?**
(ఎ) పోటోమాక్ (బి) హడ్సన్
(సి) సెయింట్ లారెన్స్ (డి) మిసిస్సిపి

**2.ఈ కింది వాటిలో థేమ్స్ నది ఒడ్డున ఉన్న నగరం ఏది?**
(ఎ)లండన్ (బి) వాషింగ్టన్ డిసి (సి) పారిస్ (డి) వియన్నా

**3.జర్మనీలోని బెర్లిన్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?**
(ఎ) డాన్యూబ్ (బి) డార్లింగ్ (సి) స్ప్రీ (డి) అమెజాన్

**4.ఈ కింది వాటిలో 'టైగ్రిస్' నది ఒడ్డున ఉన్న నగరం ఏది?**
(ఎ) టెహ్రాన్ (బి) బాగ్దాద్ (సి) సిడ్నీ (డి) బామ్

**5.వాషింగ్టన్ డిసి నగరం ఏ నది ఒడ్డున ఉంది?**
(ఎ) హడ్సన్ (బి) మిసిస్సిపి (సి) డెలావరే (డి)పొటోమాక్

**6.ఈ క్రింది వాటిలో 'సీన్' నది ఒడ్డున ఉన్న నగరం ఏది?**
(ఎ) యాంగూన్ (బి) ఒట్టావా (సి) పారిస్ (డి) బీజింగ్

**7.ఆస్ట్రియాలోని వియన్నా నగరం ఏ నది ఒడ్డున ఉంది?**
(ఎ) పొటోమాక్ (బి) డాన్యూబ్ (సి) టైబర్ (డి) కాలదన్

**8.ఈ క్రింది వాటిలో మిసిస్సిపి నది ఒడ్డున ఉన్న నగరం ఏది?**
(ఎ) సెయింట్ లూయిస్ (అమెరికా)
(బి) చిట్టగాంగ్ (బంగ్లాదేశ్) (సి) న్యూయార్క్ (అమెరికా)
(డి) ఆంట్ వెర్ప్ (బెల్జియం)

**9.ఇటలీలోని రోమ్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?**
(ఎ) నెయిపర్ (బి) ఆల్బె (సి) టైబర్ (డి) నికియాంగ్

**10.ఈ క్రింది వాటిలో నైలునది ఒడ్డున ఉన్న నగరం ఏది?**
(ఎ) వార్సా (పోలెండ్) (బి) బాగ్దాద్ (ఇరాక్)
(సి) డుండీ (స్కాట్లండ్) (డి) కైరో (ఈజిప్ట్)

అధ్యయనాలు

**11.'థియోలజీ' అనగా ఏమిటి?**
(ఎ) మతాలపై అధ్యయనం చేయడం (బి) విషపదార్థాలపై అధ్యయనం చేయడం (సి) సంఖ్యలపై అధ్యయనం చేయడం
(డి) నదులపై అధ్యయనం చేయడం

**12.దంతాలకు సంబంధించిన వ్యాధులపై అధ్యయనం చేయు శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) టాక్సికాలజీ (బి) ఆంకాలజీ
(సి) వైరాలజీ (డి) ఓడెంటాలజీ

**13.'కార్డియాలజీ' అనగా దేనికి సంబంధించినది?**
(ఎ) మూత్రపిండాల వ్యాధులపై అధ్యయనం
(బి) నరాల వ్యాధులపై అధ్యయనం
(సి) గుండెకు సంబంధించిన వ్యాధులపై అధ్యయనం
(డి) కంటి వ్యాధులపై అధ్యయనం

**14. చంద్రుని పుట్టుక, స్వభావం, కదలికలపై అధ్యయనం చేయు శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) ఎటిమాలజీ (బి) సెలినాలజీ
(సి) మైకాలజీ (డి) హెమటాలజీ



**15.'ఆర్కియాలజీ' దేనికి సంబంధించింది?**
(ఎ) పురాతన వస్తువులు, అవశేషాలు, కట్టడాలు మొదలగు వాటిని అధ్యయనం చేసే శాస్త్రం
(బి) మానవుని భౌతిక, సాంస్కృతిక పరిణామంపై అధ్యయనం చేసే శాస్త్రం.
(సి) విశ్వం చరిత్ర, మూలం, స్వభావంపై అధ్యయనం చేసే శాస్త్రం
(డి) నేల సహాయం లేకుండా మొక్కలు పెంచే విధానంపై అధ్యయనం

**16. నేల సహాయం లేకుండా మొక్కలు పెంచే విధానాన్ని అధ్యయనం చేయటాన్ని ఏమంటారు?**
(ఎ) క్రయోజనిక్స్ (బి) హైడ్రోపోనిక్స్
(సి) జెనెటిక్స్ (డి) పోనెటిక్స్

**17. 'ఎపిగ్రఫీ' అనగా ఏమిటి?**
(ఎ) భాషలో పదాల ఆవిర్భావాన్ని అధ్యయనం చేసే శాస్త్రం
(బి) వృద్ధాప్యం, వృద్ధాప్య కాలంలో వచ్చే వ్యాధుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(సి) చారిత్రక కాలంనాటి శాసనాల్లోని ప్రాచీన లిపిని అధ్యయనం చేయటం
(డి) రక్తం, రక్తానికి సంబంధించిన వ్యాధుల అధ్యయనం

**18.వేలిముద్రల అధ్యయన శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) డాక్టిలోలజీ (బి) డెండ్రాలజీ (సి) ఎథాలజీ (డి) నెఫ్రాలజీ

**19. 'పెడాలజీ' అనగా ఏమిటి?**
(ఎ) జైళ్ళు, నేరగాళ్ళతో ఎలా మెలగడం వంటి వాటిపై అధ్యయనం
(బి) భూమి పుట్టుక, స్వభావం, ధర్మాలు మొదలగు వాటిపై అధ్యయనం
(సి) తూనికలు - కొలతలపై అధ్యయనం
(డి) మూత్రపిండాల సంబంధ వ్యాధులపై అధ్యయనం

**20.వద్ధాప్యం, వృద్ధాప్య కాలంలో వచ్చే వ్యాధుల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) జెరంటాలజీ (బి) ఆర్నిథాలజీ
(సి) ఆప్తాల్మాలజీ (డి) పొటమాలజీ

**21.నాణేలు మొదలగు వాటిపై అధ్యయనం చేయటాన్ని ఏమంటారు?**
(ఎ) న్యూమరాలజీ (బి) ఆంకాలజీ
(సి) ఎకాలజీ (డి) న్యూమిస్ మ్యాటిక్స్

**22.'క్రిప్టోగ్రఫీ' అనగా ఏమిటి?**
(ఎ) రహస్య సంకేతాలతో కూడిన రాతలపై అధ్యయనం చేయు శాస్త్రం
(బి) చారిత్రక కాలం నాటి శాసనాల్లోని ప్రాచీన లిపిని అధ్యయనం చేయడం
(సి) చారిత్రక కాలానుక్రమణికపై అధ్యయనం
(డి) మెదడులోని ఎముకల గురించి అధ్యయనం

**23.పండ్లు, పండ్ల తోటల పెంపకం గురించి అధ్యయనం చేయు శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) పినాలజీ (బి) పామాలజీ
(సి) నెఫ్రాలజీ (డి) మైకాలజీ

**24.'సిటోలజీ' అంటే ఏమిటి?**
(ఎ) విత్తనాలపై అధ్యయనం (బి) కణాలపై అధ్యయనం
(సి) జలక్షీరదాలపై అధ్యయనం (డి) జన్యువుల అధ్యయనం

**25.మానవుని నాగరికత, భౌతిక, సాంస్కృతిక పరిణామాలపై అధ్యయవం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) ఆర్నిథాలజీ (బి) ఆంత్రోపాలజీ
(సి) ఓరాలజీ (డి) సెలినాలజీ

**26.ఆప్తమాలజీ అంటే ఏమిటి?**
(ఎ) కన్ను, కంటికి సంబంధించిన వ్యాధులపై అధ్యయనం చేసే శాస్త్రం
(బి) గర్భధారణ, పిల్లల పుట్టుక వంటి వాటిపై అధ్యయనం చేసేశాస్త్రం
(సి) శరీరంలో రోగనిరోధక శక్తికి సంబంధించి అధ్యయనం చేసే శాస్త్రం
(డి) నరాలకు సంబంధించిన వ్యాధులపై అధ్యయనం చేసే శాస్త్రం

**27.విషపదార్థాలపై అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) ఫైకాలజీ (బి) టాక్సికాలజీ
(సి) హిప్నాలజీ (డి) క్రానియోలజీ

**28.'పొటమాలజీ' అంటే ఏమిటి?**
(ఎ) నదుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(బి) జంతువుల స్వభావ అధ్యయన శాస్త్రం
(సి) పిండాభివృద్ధి అధ్యయన శాస్త్రం
(డి) నిద్ర గురించి అధ్యయనశాస్త్రం

**29. నిఘంటువుల సంకలనం గురించి అధ్యయనం చేయటాన్ని ఏమంటారు?**
(ఎ) ఎత్నోగ్రఫీ (బి) ఎపిగ్రఫీ
(సి) లెక్సికో గ్రఫీ (డి) క్రిప్టోగ్రఫీ

**30. 'ఓరాలజీ' అంటే ఏమిటి?**
(ఎ) కాంతి అధ్యయనం (బి) పక్షుల అధ్యయనం
(సి) వ్యాధుల అధ్యయనం (డి) పర్వతాల అధ్యయనం

**31. చేపల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) మార్ఫాలజీ (బి) మైకాలజీ
(సి) ఇక్తియోలజీ (డి) లిథోలజీ

**32. 'క్రేనియోలజీ' అంటే ఏమిటి?**
(ఎ) మానవ గ్రంధుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(బి) పుర్రెల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(సి) కాలేయం దానికి సంబంధించిన వ్యాధుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(డి) తోటల పెంపకానికి సంబంధించిన అధ్యయనం

**33.వృక్షాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) కైటోలజీ (బి) ఎంబ్రయోలజీ
(సి) డండ్రోలజీ (డి) ఎథోలజీ

**34. కాస్మోలజీ అంటే ఏమిటి?**
(ఎ) సూక్ష్మక్రిముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(బి) విశ్వం పుట్టుక, స్వభావం, నిర్మాణం, పరిణామం గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(సి) పుర్రెల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(డి) వేలిముద్రల గురించి అధ్యయనం చేసే శాస్త్రం

**35. నిద్ర గురించి అధ్యయనం చేసే శాస్త్రాని ఏమంటారు?**
(ఎ) హిప్నోలజీ (బి) మినరాలజీ
(సి) ఓరాలజీ (డి) అంకాలజీ

**36.ఆగ్రోస్టోలజీ అంటే ఏమిటి?**
(ఎ) ధ్వని, ధ్వని తరంగాల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(బి) వివిధ రకాల గడ్డిని గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(సి) అంతరిక్షయానం, అంతరిక్ష యాత్రల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(డి) మృత్తికల గురించి అధ్యయనం చేసే శాస్త్రం

**37.విత్తనాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) నెఫ్రాలజీ (బి) అంకాలజీ (సి) కార్పోలజీ (డి) ఫైకాలజీ

**38.ఆస్ట్రోనమీ అంటే ఏమిటి?**
(ఎ) వాస్తు అధ్యయనం (బి) ఖగోళ అధ్యయనం
(సి) జన్యువుల అధ్యయనం (డి) ఆల్గేల అధ్యయనం

**39.మానవునిలోని రోగనిరోధక శక్తి, రోగనిరోధక వ్యవస్థలను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) ఎంబ్రయోలజీ (బి) ఎంటమాలజీ
(సి) ఇమ్యూనాలజీ (డి) పొటమాలజీ

**40. ఊలోజీ (Oology) అంటే ఏమిటి?**
(ఎ) పర్వతాల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(బి) గుడ్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(సి) వైన్ గురించి అధ్యయనం చేసే శాస్త్రం
(డి) ఖనిజాల గురించి అధ్యయనం చేసేశాస్త్రం

**41.శిలల లక్షణాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) లిటోలజీ (బి) డాక్టొలజీ (సి) ఓరాలజీ (డి) జియోలజీ

**42. ఫైకాలజీ అంటే ఏమిటి?**
(ఎ) మతాలపై అధ్యయనం చేయడం
(బి) ఆల్గేలపై అధ్యయనం చేయడం
(సి) సంఖ్యలపై అధ్యయనం చేయడం
(డి) వ్యాధులపై అధ్యయనం చేయడం

**43. కణితి, గడ్డలు మొదలగు వాటి గురించి అధ్యయనం చేయటాన్ని ఏమంటారు?**
(ఎ) పాథాలజీ (బి) హిస్టాలజీ
(సి) ఎటిమాలజీ (డి) ఆంకాలజీ

**44. ఓస్టియోలజీ అంటే ఏమిటి?**
(ఎ) ఎముకల అధ్యయనశాస్త్రం (బి) నదుల అధ్యయనశాస్త్రం
(సి) వైరస్‌ల అధ్యయనశాస్త్రం. (డి) టిష్యూల అధ్యయనశాస్త్రం

**45. మూత్రపిండ సంబంధ వ్యాధులపై అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) హిస్టాలజీ (బి) టాక్సికాలజీ (సి) నెఫ్రాలజీ (డి) థియోలజీ



**46. 'సిఫాలజీ' అంటే ఏమిటి?**
(ఎ) ఎన్నికలు, ఎన్నికల ఫలితాల గురించి అధ్యయనం చేయడం
(బి) భూకంపాలను గురించి అధ్యయనం చేయడం
(సి) మొక్కల పెంపకం గురించి అధ్యయనం
(డి) వాతావరణాన్ని గురించి అధ్యయనం చేయడం

**47. ఫంగస్, దానివలన వచ్చే వ్యాధులను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) సెలినాలజీ (బి) పినాలజీ (సి) హిస్టోలజీ (డి) మైకాలజీ

**48. 'హిస్టోలజీ' అంటే ఏమిటి?**
(ఎ) కణజాలాల గురించి అధ్యయనం చేసేశాస్త్రం
(బి) మృత్తికల గురించి అధ్యయనం చేసేశాస్త్రం
(సి) ఎముకల గురించి అధ్యయనం చేసేశాస్త్రం
(డి) రక్తం గుర్తించి అధ్యయనం చేసే శాస్త్రం

**49.చీమల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?**
(ఎ) థియోలజీ (బి) మిర్మకోలజీ (సి) ఆంకాలజీ (డి) మార్ఫాలజీ

**50.'మెట్రోలజీ' అంటే ఏమిటి?**
(ఎ) శిలాజాల అధ్యయనశాస్త్రం
(బి) దంతాల అధ్యయనశాస్త్రం
(సి) తూనికలు కొలతల అధ్యయనశాస్త్రం
(డి) వ్యాధుల అధ్యయనశాస్త్రం

**- రేపటి సంచికలో : నదీ తీర నగరాలు**

**జవాబులు**

(1) బి (2) ఎ (3) సి (4) బి (5) డి (6) సి (7) బి (8) ఎ (9) సి (10) డి (11) ఎ (12) డి (13) సి (14) బి (15) ఎ (16) బి (17) సి (18) ఎ (19) బి (20) ఎ (21) డి (22) ఎ (23) బి (24) సి (25) బి (26) ఎ (27) బి (28) ఎ (29) సి (30) డి (31) సి (32) బి (33) సి (34) బి (35) ఎ (36) బి (37) సి (38) బి (39) సి (40) బి (41) ఎ (42) బి (43) డి (44) ఎ (45) సి (46) ఎ (47) డి (48) ఎ (49) బి (50) సి

సంపాదకీయం

# నిర్వహణ లోపమే..!

క్రికెట్ ప్రపంచంలో పెనువిషాదం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) విజయోత్సవం జనాల ప్రాణాలు తీసిన దురదృష్టకర దుర్ఘటన. ఐపిఎల్ ఫైనల్‌లో టైటిల్ సాధించిన ఆర్‌సిబి టీంను సన్మానించేందుకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియాన్ని బుధవారం అట్టహాసంగా ముస్తాబు చేయగా, అక్కడికి లక్షలాదిగా అభిమానులు, ప్రజలు ముంచెత్తడంతో భారీగా తొక్కిసలాట జరిగి 11 మంది నిష్కారణంగా బలి కావడం మానవమాత్రులెవరినైనా కలచివేస్తుంది. మరణించిన వారిలో ఆరుగురు పురుషులు కాగా ఐదుగురు మహిళలు. దిగ్భ్రాంతిగొలిపే విషయం చనిపోయిన వారిలో తొమ్మిది మంది ఇరవై ఏళ్ల లోపు నవ యువకులే కావడం. తోపులాటలో 50 మంది వరకు తీవ్రంగా గాయపడగా, 400 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నది కర్ణాటక ప్రభుత్వ లెక్క. ఈ సంఘటనపై సర్కారు మెజిస్టేరియల్ ఎంక్వయిరీకి ఆదేశించింది. నగర పోలీస్ కమిషనర్ సహా కొందరు కీలక అధికారులను సస్పెండ్ చేసింది. సిఎం సిద్దరామయ్య రాజకీయ కార్యదర్శిపై కూడా వేటు పడింది. ఇంటిలిజెన్స్ చీఫ్‌తో పాటు పలువురు కీలక పోలీసు అధికారులను బదిలీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆర్‌సిబి, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కొందరిని అరెస్టులు చేసింది. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పరిహారాలు సరేసరి.

తొక్కిసలాట దృశ్యాలను చూస్తే నిర్వహణ, భద్రతా వైఫల్యాలు, నిఘా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఘటన తీవ్రత రీత్యా రాష్ట్ర హైకోర్టు సైతం సూమోటోగా స్వీకరించి గురువారం తక్షణ విచారణ ప్రారంభించి సంధించిన ప్రశ్నలు ఈవెంట్ నిర్వహణలో లోపాలను ప్రాథమికంగా నిర్ధారించేవిగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ నెల 10 కల్లా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. అసలు ఎవరు ఆర్‌సిబి బృందాన్ని సన్మానించాలనుకున్నారో తెలియాలి. మంగళవారం రాత్రి అహ్మదాబాద్‌లో మ్యాచ్ ముగియగా ఆర్‌సిబి ప్లేయర్స్ టీం మర్నాడు మధ్యాహ్నం 2.45 గంటలకల్లా బెంగళూరుకు తరలి వెళ్లింది. విధాన సౌధలో రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్, ముఖ్యమంత్రి, డిప్యూటి సిఎం టీంను సన్మానించారు. సాయంత్రం ఆరుగంటలకు చిన్నస్వామి స్టేడియంలో ప్రజల సమక్షంలో విజయోత్సవాలకు ప్లాన్ జరిగింది. విధాన సౌధకు సదరు స్టేడియం అర కిలోమీటరు దూరం ఉంటుందంతే. స్టేడియం కెపాసిటీ 35 వేలు కాగా స్టేడియం వెలుపల మూడు లక్షల మంది వరకు చేరారని అంచనా. లోపల విజయోత్సవాలు జరుగుతున్న సమయంలోనే బయట జనం హాహాకారాలు మిన్నంటాయి. అంత మంది వస్తారని ఊహించలేదని ప్రభుత్వం, నిర్వాహకులు చెప్పడం నప్పదు. జనాల, అభిమానుల భావోద్వేగాలను అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, నిర్వాహకులది. కనీసం ఫస్ట్ ఎయిడ్ కూడా కొన్ని గంటలపాటు లభించలేదంటున్న బాధితుల అచేతన స్థితినిబట్టే అక్కడి సౌకర్యాలను దౌర్భాగ్యమేంటో ఊహించవచ్చు.

నయా ఉదారవాద విధానాల పర్యవసానంగా వచ్చింది ఐపిఎల్. ఫక్తు వ్యాపార క్రీడ. రానురాను స్పాన్సర్స్, దిగ్గజ కంపెనీల జోక్యానికి హద్దు పద్దు లేకుండా పోయింది. తమకు నచ్చిన ఆటగాళ్లను కొనుక్కొని టీంలు చేసి ఆడించడం, దీనిపై వందల వేల కోట్ల రూపాయల వ్యాపారం జరగడం గ్యాంబ్లింగ్‌ను తలపిస్తుంది. నీతి నియమాలు క్రీడా స్ఫూర్తి మచ్చుకైనా కనిపించవు. కనిపించేదంతా వ్యాపారం, లాభాలు, జూదమే. ఐపిఎల్ మ్యాచ్‌లకు కల్పించే ప్రచారం అంతా ఇంతా కాదు. యువత ఆ వైపు ఆకర్షితమవుతోంది. వారి భావోద్వేగాలను కంపెనీలు ఎంచక్కా క్యాష్ చేసుకుంటున్నాయి. ఆ ధోరణే ఛాంపియన్ సాధించిన ఆర్‌సిబి టీంను తక్షణం సన్మానించాలన్న, విజయోత్సవాలు నిర్వహించాలన్న లక్ష్యానికి హేతువుగా ఉంది. ఈ హడావుడే కనీస ఏర్పాట్లు, భద్రతాచర్యలు చేపట్టనీకుండా చేశాయి. వేడిలో వేడిగా విజయోత్సవాలపైనా నాలుగు కాసులు సంపాదించుకునే రంధి ఒక్కటే కనిపిస్తుంది. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట మరణాలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఆర్‌సిబి, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను రూపొందించి అమలు చేయాలి.

మహనీయుల మాట



**స్వార్థం, అశ్రద్ధ, లంచగొండితనం, పేరు ప్రతిష్టల కోసం ఆరాటపడడం- వగైరాలన్నీ అత్యంత అసహ్యకరమైనవి. నిస్వార్థం, శక్తినంతా వినియోగించి శ్రమపడడం, హృదయపూర్వకమైన దీక్షతో ప్రజాసేవ చేయడం నిరాడంబరంగా కష్టపడి పనిచేయడం - ఈ లక్షణాలు మాత్రమే గౌరవాన్ని సంపాదించి పెడతాయి.**

**- మావో**

# ప్రచారకాండ కాదు, పార్లమెంటు ద్వారానే స్పందన

వ్యాఖ్య




PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

'**నా** నరాల్లో రక్తం కాదు, సింధూరం ప్రవహిస్తోంది' ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రచార హంగామా ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఎంచుకున్న తన తరహా మాటలివి. దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సవాలు ముందుకొచ్చి నిల్చున్న తరుణంలో ఆయనగానీ ఆయన ప్రభుత్వంగానీ అంతకన్నా ఏం చేయగలుగుతుంది? ఈ సర్కారుకు ఎప్పుడూ ఏ సమయంలోనూ పారదర్శకత, అంతరావలోకనతో సంబంధం లేదు.

ప్రధాన మంత్రిని కేంద్ర విగ్రహంగా నిలబెట్టడం చుట్టూనే మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆధారపడింది. ఏకీకృత దౌత్యనీతిని అమలు చేయడం కన్నా ఒక విధమైన వ్యక్తి ఆరాధాన పెంచడమే పనిగా పెట్టుకుంది. విదేశాంగ విధానానికి మోడీ విగ్రహాన్ని అగ్రభాగంలో వుంచడమే ప్రధానంగా చేసుకోవడంతో సంప్రదాయకమైన విదేశాంగ విధానంలోని విజ్ఞత తలకిందులైంది. వ్యవస్థిత దౌత్య సంప్రదాయాలు తలకిందులైపోయాయి.

**లొసుగుల దాచివేత**

చారిత్రికంగా భారతదేశ విదేశాంగ విధానం దాని అంతర్గత పునాదులపై ఆధారపడి రూపొందింది. సజీవమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య విధానంతో నడిచే వైవిధ్యం, సామాజిక ఆర్థిక న్యాయాలకు కట్టుబాటు సూత్రాల దృఢత్వంపై ఆధారపడింది. ప్రపంచ దేశాలలో భారతదేశ ప్రతిష్ట పెరగడానికి ఈ సూత్రాలు గట్టి ప్రాతిపదికగా పనిచేశాయి. బహుళత్వంతో కూడిన ఒక దేశపు సమాన పౌరసత్వంపై ఆధారపడిన భిన్నత్వంలో ఏకత్వం భారత రిపబ్లిక్‌కు విలక్షణమైన సంకేతంగా వుంటూ వచ్చింది.

ఈ వారసత్వం దెబ్బతినిపోవడమే ఇప్పటి విషాదం. క్రమబద్ధమైన సూత్రాలపై ఆధారపడిన విదేశాంగ విధానం స్థానంలో వ్యక్తి కేంద్రకంగా వ్యక్తిగత ఇమేజి ప్రాతిపదికగా నడిచే దౌత్యనీతి ఆక్రమించింది. అయితే ఈ విధానం నిలిచేది కాదు. ప్రత్యేకించి ఇండియా వంటి దేశానికి. దశాబ్దాల పాటుసాగిన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ స్వాతంత్ర పోరాటంతో ఈ దేశానికి అంతర్జాతీయ ప్రతిష్ట ఏర్పడింది. ఆ క్రమంలో అది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా రూపు దాల్చింది. ఈ వారసత్వం నుంచి దూరం కావడం అనేది ఆరెస్సెస్ డిఎన్ఎ లోనే వున్న లక్షణం.

పహల్గాం హత్యాకాండ నేపథ్యంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం ఎట్టకేలకు 'నిఘా లొసుగులు' వున్నాయని ఒప్పుకోక తప్పలేదు. అయితే ఈ ఒప్పుకోలు చాలా ఆలస్యంగా అరకొరగానే జరిగింది. ఇప్పటికీ ప్రభుత్వం ఈ లొసుగులు ఎలాంటివో ఎంత విస్తృతంగా వున్నాయో మాత్రం స్పష్టీకరించలేదు.

**ప్రజలకు పాత్రేదీ?**

వైమానిక దళ ప్రధానాధికారి అనిల్ చౌహాన్ సింగపూర్‌లో ఒక భద్రతా సదస్సు సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజుల ఘర్షణలో యుద్ధ విమానాల నష్టపోయామని ఒప్పుకున్నారు. అయితే అంతకు మించి ఆయన మరేమీ చెప్పలేదు. అలాంటి అసంపూర్ణ వివరణలు, వైఫల్యం లోతుపాతులు పూర్తిగా వివరించ జాలవు. ప్రస్తుత సంక్షోభం రీత్యా మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలన రికార్డు–మరీ ముఖ్యంగా 370వ అధికరణం రద్దు తర్వాత–ఎలా వుందో విస్మరించలేము. 370వ అధికరణం తీసిపారేయడం, విలీన ఒప్పందంతో ముడిపడిన కీలక చారిత్రక సత్యాలను తోసిపుచ్చడం భారత యూనియన్‌లో జమ్ముకాశ్మీర్ కలసిపోయినప్పటి వారసత్వాన్ని దెబ్బతీశాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో జమ్ముకాశ్మీర్ ప్రజలు ప్రత్యేకించి లోయవాసుల పాత్రను వమ్ము చేశాయి.

పహల్గాం తర్వాత ఇది మరింత కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా లోయ పొడుగునా వున్న ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెల్పిన పరిస్థితులలో శక్తివంతమైన ఈ ప్రజా ఐక్యతను చాలా సానుకూల పరిణామంగా చూడవలసి వుండింది. కాని ప్రభుత్వం ఆ వాస్తవాన్ని గుర్తించడం గానీ అభినందించడం గానీ జరగలేదు.అందుకు బదులుగా కాశ్మీర్ ప్రజలనే ఈ దాడిలో ఇరికించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దానివల్ల ప్రభుత్వ నిజమైన ఉద్దేశం ఏమిటో అసలైన సైద్ధాంతిక దృక్పథం ఏమిటో బహిర్గతమైంది. గతంలో ప్రభుత్వాలు రాజ్యాంగంలోని ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలను నిలబెట్టేవిధంగా నిష్పక్షపాత వైఖరితో వ్యవహరిస్తే దాని స్థానంలో ప్రజలనూ అటూ ఇటూ రెండుగా విభజించే విధానం తెచ్చిపెట్టారు.

**అంతర్గత విధానాల ప్రకారమే..**

టెర్రరిజంపై పోరాటం కేవలం సైనిక ఘర్షణగానే పరిమితం చేయడం కుదిరేపని కాదు. నిజంగా శాంతిని కోరుకుంటే విధాన స్పష్టత వుండాలి. జాతీయ సమైక్యతను పటిష్టం చేసే చర్యలలో అది ప్రతిబింబించాలి. విదేశాంగ విధానం, దౌత్యం వేర్వేరు ప్రయత్నాలు కాదు. దేశీయ విధానాల కొనసాగింపే అవీ. మతపరమైన సమీకరణ పెంచడమూ, ప్రజాస్వామిక హక్కులూ మైనార్టీల హక్కులను హరించడం గత పదకొండేళ్ల పరిణామాలు గమనిస్తే ప్రధానంగా వుంటున్న దాటవేయలేని వాస్తవం, ప్రత్యేకించి ఇప్పుడున్న పరస్పర సంబంధిత సమాచార చోదిత అంతర్జాతీయ సందర్భంలో అలా సాధ్యమయ్యేది కాదు.

పహల్గాం దాడి తర్వాత ముస్లింలపై 184 ముస్లిం వ్యతిరేక విద్వేష నేరాలు జరిగినట్టు పౌర బృందాలతో కూడిన ఒక నిజ నిర్ధారణ సంఘం నివేదించింది. మొత్తంగా ముస్లింలు ప్రత్యేకించి కాశ్మీరీలు లక్ష్యంగా ఈ నేరపూరత చర్యలు జరిగాయి. ఈ చర్యలు నిరాటంకంగా సాగుతూనే వున్నాయి.

పహల్గాం హత్యాకాండకు సంబంధించి సాధికారికమైన ఆధార పత్రాల సేకరణ, ప్రభుత్వ ప్రేరిత ఉగ్రవాద బృందాల సీమాంతర కార్యకలాపాల పథకాల వివరాలు జరక్కపోవడం అంతర్జాతీయ వేదికలపై భారత వాదనలను మరింత బలహీనం చేసింది. పాకిస్తాన్ ఉద్దేశాల విషయంలో దేశ ప్రజలు నిజమని భావించచ్చుగాని అంతర్జాతీయ సమాజాన్ని ఒప్పించాలంటే మరింత బలమైన పారదర్శక సాక్ష్యాధారాలు కావాలి.

మాజీ సైనిక దళాల ప్రధానాధికారి జరనల్ మనోజ్ నిర్వాణే మాటల్లో అలాంటి అరుదైన ఒక స్పష్టత కనిపించింది. "యుద్ధమేమీ కాల్పనిక కవిత కాదు. మీ బాలీవుడ్ సినిమాలా వుండదు. అది చాలా తీవ్రమైన వ్యవహారం. బుద్ధిహీనులు మనపై యుద్ధం రుద్దినా మనం దానిపై కేరింతలు కొట్టవలసింది లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. శాంతియుత చర్చలకే ప్రాధాన్యతనిస్తూ యుద్ధానికి సిద్ధం కావాలన్నారు.

**ఆలస్యంగా దౌత్యయాత్రలు**

ఈ దౌత్యపరమైన ప్రయత్నాల విస్తరణలో భాగంగా వివిధ పార్టీలకు చెందిన 59 మంది ఎంపిల బృందాలు 32 దేశాలలో పర్యటిస్తున్నాయి. విదేశాలలో పార్లమెంటు సభ్యులకు, నిపుణలకు మేధావి బృందాలకు మీడియా ప్రతినిధులకు పహల్గాం సంఘటనపై భారత ప్రభుత్వ వైఖరిని తెలియజేయడం ఈ యాత్రల లక్ష్యం. అయితే ఇలా వెళ్లిన దేశాలలో భారత్ ఇరుగు పొరుగు దేశం ఒకటైనా లేదు. 'నా నరాల్లో రక్తం కాదు, సింధూరం ప్రవహిస్తోంది' అంటున్న ప్రధాని నరేంద్ర మోడీ మాటలతో సహా దేశంలో చెప్పుకుంటున్న దానికి ఈ దౌత్య యాత్రలు పూర్తి భిన్నమైన దిశలో నడుస్తున్నాయి. టెర్రరిస్టు వ్యతిరేక చర్యలే ఈ ప్రభుత్వ అతి గొప్ప విజయాలుగా చేస్తున్న ప్రకటనలూ ఇందుకు విరుద్ధంగానే వున్నాయి.

అయితే ఆలస్యంగా మొదలైన ఈ దౌత్య యాత్రల ప్రయత్నం ఏ మేరకు జయప్రదమవుతుందో ఇప్పటికే తేలిపోయింది. పాకిస్తాన్ ఐఎంఎఫ్ దగ్గర పది వేల కోట్ల డాలర్లు, ప్రపంచ బ్యాంకు దగ్గర నాలుగు వేల కోట్ల డాలర్లు అప్పు తెచ్చుకోవడానికి ఎవరి నుంచి ఎలాంటి వ్యతిరేకతా లేకపోయింది. ఇజ్రాయిల్, ఆఫ్ఘనిస్థాన్ లోని తాలిబాన్ ప్రభుత్వం తప్ప మరే దేశమూ భారత వైఖరిని సమర్థించింది లేదు. వాస్తవాలను కప్పిపుచ్చడం వల్ల ఎవరికీ ప్రయోజనం వుండదు.

**ప్రజలపై పోరాటం పొరబాటు**

దశాబ్దాలుగా కొనసాగుతున్న సింధు జలాల ఒప్పందాన్ని హఠాత్తుగా తిరస్కరించడంతో ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. సరిహద్దులలోని నదుల నీళ్లను వాటి పైన కింద గల పరీవాహక ప్రాంతాల వినియోగ హక్కును గుర్తించడం అంతర్జాతీయ అంగీకృత సూత్రం. పరస్పరం కదుర్చుకున్న ఒక ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలగడం పట్ల ప్రపంచ దేశాల మద్దతు లభించడం కష్టం. ఆచరణలో చూస్తే భారత దేశానికి నదీ ప్రవాహాన్ని ఆపివుంచేందుకు అవసరమైన రిజర్వాయర్ సామర్థ్యం కూడా లేదు. ప్రభుత్వం నీటి ప్రవాహం వివరాలు ప్రచురించడం మానేసింది. అంటే దీనివల్ల వరదలో లేక కరువులో వస్తే పాకిస్తాన్ రైతులు, సామాన్య ప్రజలే అత్యధికంగా నష్టపోతారన్నమాట.

వారు భారతీయులైనా పాకిస్తాన్ ప్రజలైనా టెర్రరిజంపై పోరాటం టెర్రరిస్టులపై జరగాలి గానీ ప్రజలపై కాదు. టెర్రరిస్టులను ఏకాకులను చేయాలి. మొత్తం ప్రజలపై పోరాటం ఎన్నటికీ సానుకూల ఫలితాలను ఇవ్వజాలదు. ఒక సమగ్రమైన సూత్రబద్ధమైన వ్యూహానికి మారుగా వ్యూహాత్మక చర్యలకు దిగడం వల్ల ప్రయోజనం లేదు.

**పార్లమెంటు, ఇతర చర్యలు**

సరిగ్గా ఈ కారణం వల్లనే ప్రతిపక్షాలు ఈ సంక్షోభానికి సంబంధించిన అన్ని కోణాలు చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలని కోరుతున్నాయి. అలాంటి ప్రత్యేక సమావేశమే వాతావరణంలో స్పష్టత తెచ్చేందుకు సరైన వేదిక అవుతుందని 16 ప్రతిపక్షాలు ప్రభుత్వానికి లేఖ రాశాయి. మన ముందున్న సవాళ్లను ఎదుర్కొనడానికి అతుకుల బొంత పరిష్కారాలు పనికిరావు.

ప్రధాని మోడీని యుద్ధ కాలపు నేతగా చూపించే భారీ కటౌట్లు, బ్యానర్లు ఇప్పుడు కూడా దేశమంతటా దర్శనమిస్తున్నాయి. ఈ విధంగా సాయుధ ఘర్షణను రాజకీయంగా ఉపయోగించుకోవడం గురించి ఎన్నికల సంఘంతో జరిపిన చర్చల సందర్భంలో మేము ఆందోళన వెలిబుచ్చాము. ఎన్నికల అవసరాల కోసం దేశంలో ప్రచారం చేసుకుంటే అది అంతర్జాతీమ వేదికలపై బెడిసికొట్టే ప్రమాదముంది. భారత ప్రభుత్వం యుద్ధోన్మాదంతో వ్యవహరించిందని భావించే అవకాశముంటుంది.

డోనాల్డ్ ట్రంప్ జోక్యం లోగుట్టు ఏమిటనేదానిపై కూడా ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సి వుంటుంది. అది మూడో పక్షం మధ్యవర్తిత్వమే అవుతుంది. ద్వైపాక్షిక అంశాలలో బయటివారి జోక్యం వుండరాదంటూ భారతదేశం సుదీర్ఘ కాలంగా అనుసరిస్తున్న ఏకాభిప్రాయానికి ఇది పూర్తి విరుద్ధమైన చర్య అవుతుంది.

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల కోసం ఒక గట్టి ప్రయత్నం వెనువెంటనే సూటిగా ప్రారంభం కావాలి. జమ్ము కాశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడంతో పాటు రోజువారీ పాలన లోనూ ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలను మళ్లీ తీసుకురావాలి. ప్రస్తుత సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి అర్థవంతమైన మార్గం అదొక్కటే అవుతుంది.

**(జూన్ 4 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)**

> **చారిత్రికంగా భారతదేశ విదేశాంగ విధానం దాని అంతర్గత పునాదులపై ఆధారపడి రూపొందింది. సజీవమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య విధానంతో నడిచే వైవిధ్యం, సామాజిక ఆర్థిక న్యాయాలకు కట్టుబాటు సూత్రాల దృఢత్వంపై ఆధారపడింది. ప్రపంచ దేశాలలో భారతదేశ ప్రతిష్ట పెరగడానికి ఈ సూత్రాలు గట్టి ప్రాతిపదికగా పనిచేశాయి. బహుళత్వంతో కూడిన ఒక దేశపు సమాన పౌరసత్వంపై ఆధారపడిన భిన్నత్వంలో ఏకత్వం భారత రిపబ్లిక్‌కు విలక్షణమైన సంకేతంగా వుంటూ వచ్చింది. ఈ వారసత్వం దెబ్బతినిపోవడమే ఇప్పటి విషాదం. క్రమబద్ధమైన సూత్రాలపై ఆధారపడిన విదేశాంగ విధానం స్థానంలో వ్యక్తి కేంద్రకంగా వ్యక్తిగత ఇమేజి ప్రాతిపదికగా నడిచే దౌత్యనీతి ఆక్రమించింది. అయితే ఈ విధానం నిలిచేది కాదు.**

> **ప్రధాని మోడీని యుద్ధ కాలపు నేతగా చూపించే భారీ కటౌట్లు, బ్యానర్లు ఇప్పుడు కూడా దేశమంతటా దర్శనమిస్తున్నాయి. ఈ విధంగా సాయుధ ఘర్షణను రాజకీయంగా ఉపయోగించుకోవడం గురించి ఎన్నికల సంఘంతో జరిపిన చర్చల సందర్భంలో మేము ఆందోళన వెలిబుచ్చాము. ఎన్నికల అవసరాల కోసం దేశంలో ప్రచారం చేసుకుంటే అది అంతర్జాతీమ వేదికలపై బెడిసికొట్టే ప్రమాదముంది. భారత ప్రభుత్వం యుద్ధోన్మాదంతో వ్యవహరించిందని భావించే అవకాశముంటుంది.**

# కుల వివక్ష - దళితులపై పెరుగుతున్న దాడులు

విశ్లేషణ



> **ప్రభుత్వాలకు చిత్తశుద్ధి వుంటే ఈ ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలి. ఇటువంటి కుల వివక్షతో కూడిన చర్యలు, దాడులు మానవ సమాజానికి బాధాకరమైనవి. గంజాయి, మత్తుమందులు, మద్యం విచ్చలవిడిగా సమాజంలోకి గుమ్మరించి యువకులను నేరస్తులను చేస్తున్నారు. మద్యపాన నిషేధానికి పిలుపునివ్వాల్సిన సందర్భం ఇది. నిజానికి ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, వామపక్ష వాదులు రాజ్యాంగ రక్షణ కోసం దళితుల విముక్తి కోసం సంఘటితంగా పాటుపడవలసిన చారిత్రక సందర్భం ఇది. పదవులు శాశ్వతం కాదు. రాజ్యాంగ బద్ధంగా, సామాజిక న్యాయపరంగా ఎవరు పరిపాలన సాగిస్తారో వారే చరిత్రలో నిలబడతారు.**



**డా॥ కత్తి పద్మారావు**

**దే**శంలో దళితుల ఆత్మగౌరవం మీద, విద్యా సంస్కృతి మీద, జీవించే హక్కు మీద, రాజ్యాంగేతర దాడులు తీవ్రమయ్యాయి. అస్పృశ్యతా భావన, కుల ద్వేషం, స్త్రీ అణచివేత అనే మనుస్మృతి భావాలు ఇంకా అగ్రవర్ణ సమాజంలో ఘనీభవించే వున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు ఆందోళన కలిగించేవిగా వున్నాయి. ముఖ్యంగా తిరుపతిలోని విద్యానికేతన్ ఇంజినీరింగ్ కాలేజీలో బి.టెక్ (కంప్యూటర్స్) నాల్గవ సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై ఘోరమైన దాడి జరిగింది.

జేమ్స్‌ను కొంతమంది ఎల్కెట్ పార్క్ హోటల్ బాత్రూంలో రెండు రోజుల పాటు (2025 మే14 అర్ధరాత్రి నుండి) నిర్బంధించి అత్యంత కిరాతకంగా కొట్టారు. పైగా కులం పేరుతో అవమానకరంగా తిట్టారు. 'ఎవరికైనా ఈ విషయం చెప్పితే నిన్ను చంపేస్తాం, నీ శవం కూడా కనపడకుండా చేస్తాం' అని బెదిరించారు. జేమ్స్ స్నేహితుడైన సాయి రెడ్డిని కూడా అదే హోటల్లో నిర్బంధించి 'జేమ్స్‌కు సపోర్ట్ చేస్తావా?' అంటూ విచక్షణారహితంగా కొట్టారు. మానసికంగా, శారీరకంగా నానా చిత్రహింసలు పెట్టారు. ఈ విషయాలన్నింటిని వీడియోలు తీశారని జేమ్స్, సాయిరెడ్డి తెలిపారు. నిజానికి ఈ సంఘటన హృదయాన్ని కలిచివేస్తుంది. కారంచేడు చుండూరు ఘటనలు కూడా అహేతుకమైన ద్వేషం వలననే జరిగాయి. కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో, స్కూళ్లలో దళిత విద్యార్థుల మీద ఇప్పటికీ అమానుషమైన దాడులు జరుగుతున్నాయి.

పోలీసు వ్యవస్థ ప్రతి సందర్భంలోను పాలక వర్గాలకు, అగ్ర వర్ణానికి వత్తాసు పలుకుతూ వుంటుంది. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా తీసుకోనటువంటి కుల వివక్షతో కూడిన దారుణ పరిస్థితులు వుండడం రాజ్యాంగ విరుద్ధమైన అంశం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం దేశంలో ప్రతి పౌరుడికి సమానత్వ హక్కు ఉంది. ఆర్టికల్ 15(2) ప్రకారం కుల, మత, జాతి, లింగం ఆధారంగా ఎవరినీ వివక్షకు గురి చేయరాదు. ఆర్టికల్ 17 స్పష్టంగా అణగారిన వర్గాలపై జరిగే అణచివేత, అవమాన చర్యలను నిరోధిస్తుంది. ఈ హింసాత్మక ఘటన కేవలం కులం పేరుతో తిట్లు, శారీరక, మానసిక హింస, అనాధారిత చిత్రహింసలు మాత్రమే కాదు, భారత రాజ్యాంగ విలువలపై చేసిన దాడి. ఈ చర్యలు ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) సవరణ చట్టం, 1989, భారత శిక్షా స్మృతి (ఐపిసి) లోని 307 (హత్యాయత్నం), 342 (అక్రమ నిర్బంధం), 323 (హింస), 506 (బెదిరింపు), 509 (మహిళల గౌరవానికి విఘాతం) వంటి సెక్షన్లకు లోబడి ఖండించదగినవి. పైగా ఈ చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు) ఉల్లంఘనగా చట్టపరంగా గుర్తించబడతాయి. భారత రాజ్యాంగం ప్రకారం పోలీసు వ్యవస్థ నడవకపోవడానికి కారణం ప్రతి విషయంలో రాజకీయ జోక్యం వుంది. రాజ్యం ఎవరి చేతుల్లో వున్నా దళితులపై ఒకే విధమైన వివక్ష కొనసాగుతుంది. నిరంతరం ప్రభుత్వాలు మానవ హక్కుల ఉల్లంఘనకు గురవుతున్నాయి.

ఇకపోతే తెనాలిలో ఇటీవల ముగ్గురు దళిత మైనార్టీ యువకులను పోలీసులు రోడ్డు మీద కాళ్ళు చాపించి కర్రలతో కొట్టిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులు తప్పు చేసిన వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచి తగిన సాక్ష్యాధారాల ద్వారా జైలుకు పంపవచ్చు. ఇది రాజ్యాంగ బద్ధంగా జరగాలి. కాని ప్రజలను, దళితులను, మానవ హక్కుల వాదులను భయభ్రాంతులను చేసే ప్రయత్నంగా వుంది. ముఖ్యంగా ఎన్నో పోరాటాలకు నెలవైన తెనాలి ఐతానగర్ నడి బొడ్డున ఈ ఘటన జరగడం దళితులను భయభ్రాంతులను చేసే ప్రయత్నంగానే కనిపిస్తున్నది.

మూడు రోజుల పాటు వారిని చట్టవిరుద్ధంగా అదుపులో ఉంచడమే కాకుండా, ఒకరి జేబులో కత్తి పెట్టి ఇద్దరు వీఆర్వోలను పిలిపించి...అతడి జేబులో మారణాయుధం ఉన్నట్లు పంచనామా రాయించారు. ఆ మర్నాడు ఏప్రిల్ 28న వారిని కోర్టులో హాజరు పర్చారు. పోలీసుల దెబ్బలకు వారి కాళ్లు బొబ్బలెక్కినా వారి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవడమే కాకుండా, న్యాయమూర్తి ఎదుట నోరు విప్పితే, పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. నిజంగా తిరుపతి, తెనాలి సంఘటనలను చూసినట్లయితే పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తుంది. ఈ సంఘటనను నిరసిస్తూ దళిత సంఘాలు, వామపక్షాలు, ప్రతిపక్షాలు, తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నాయి. అయితే పాలక వర్గం ఏదో విధంగా సమర్థించుకోవాలని చూస్తున్నది. దళితులను, మైనార్టీలనే బహిరంగంగా కొట్టడానికి కారణం పాలక వర్గానికి కుల వివక్ష వుందనే చెప్పాలి. ఈ విషయం మీద ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ లీగల్ సెల్ సుప్రీం కోర్టు బెంచికి రిపోర్టు చేసింది. ఎస్సీ, ఎస్టీ, కమిషన్లన్నిటికి తెలియజేసింది.

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి వుంటే ఈ ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలి. ఇటువంటి కుల వివక్షతో కూడిన చర్యలు, దాడులు మానవ సమాజానికి బాధాకరమైనవి. గంజాయి, మత్తుమందులు, మద్యం విచ్చలవిడిగా సమాజంలోకి గుమ్మరించి యువకులను నేరస్తులను చేస్తున్నారు. మద్యపాన నిషేధానికి పిలుపునివ్వాల్సిన సందర్భం ఇది. నిజానికి ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, వామపక్ష వాదులు రాజ్యాంగ రక్షణ కోసం దళితుల విముక్తి కోసం సంఘటితంగా పాటుపడవలసిన చారిత్రక సందర్భం ఇది. పదవులు శాశ్వతం కాదు. రాజ్యాంగ బద్ధంగా, సామాజిక న్యాయపరంగా ఎవరు పరిపాలన సాగిస్తారో వారే చరిత్రలో నిలబడతారు. రాజ్యాంగమే ప్రమాణం, ప్రజలే చరిత్ర నిర్మాతలు.

**(వ్యాసకర్త సెల్ : 9849741695)**

కవిత్వం

## కొంచెం అన్నం పెట్టు

రైతును బయటికి గెంటెయ్యాల్సిందే.
ముసలోడైనా, ఊతకర్ర మీదున్నా
రైతే కదా!
వాడిని గెంటేయాల్సిందే.
అన్నం పెట్టేవాడికీ సున్నం పెట్టకపోతే ఎలా?
పొలంలో పైరు మొలకలు నాటే వాళ్ళకు
ఢిల్లీ వీధుల్లో ములుకులు నాటినప్పుడు
ఖానాపూర్ లో రెక్కబట్టి లాగి తోసేయడం ఒక లెక్కా!!!
మీ ఇళ్ళల్లో, మీ ఆఫీసుల్లో
మీరు తగిలించుకున్న ఫోటోలు
మీకు అన్నం పెట్టవు.
ఇంటికి పోయి మీరు తినే అన్నం పిడచ చేసుకుని చూడండి
అందులో రైతు పిడికిలి కనిపిస్తుంది.
రేపు ఆఫీసుకు పోయి మీ లాఠీ చూసుకోండి.
అందులో ముసలాయన దుడ్డుకర్ర కనిపిస్తుంది.
మీరు రాసే కలంను చూసుకోండి
అందులో ముసలాయన హలం కనిపిస్తుంది.
రాత్రి పడుకున్నాక మీ చేయి ఒకసారి చూసుకోండి
బహుశా అది వణుకుతూ ఉండొచ్చు.
రైతు దయాపరుడు
వాడిని కొట్టిన వాడికి కూడా
బువ్వ పెడతాడు.
ముసలి రైతన్నా!
వాళ్ళొక రెక్క లాగేసినా
నీకింకొక రెక్క మిగిలే ఉంది కదా!
రేపు మళ్ళీ పొలంలో పైరు నాటడానికి.
నిన్ను తరిమికొట్టిన వాళ్ళు
ఆకలితో ఉన్నారు
వాళ్ళకు పిడికెడు అన్నం పెట్టు.
అపకారికి ఉపకారం చేసే
జాతి కదా నీది!!!

**- రాచపాళెం, సెల్ : 9440222117**

**(తెలంగాణలోని నిర్మల్ జిల్లా, ఖానాపూర్ మండలం ఎల్లాపూర్ లో భూభారతి చట్టం కోసం జరుగుతున్న రెవెన్యూ సదస్సులో తన బాధను చెప్పుకోడానికి ఊతకర్రతో వచ్చిన ముసలి రైతును అక్కడి పోలీసు రెక్కబట్టి లాగి బయటకు తోసేసిన దృశ్యం చూసి)**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps @ gmail.com

### ఉగ్రవాదం, యుద్ధోన్మాదం, మత విద్వేషాలకు వ్యతిరేకంగా

# వారం రోజుల పాటు ప్రచారోద్యమం

## సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు



**న్యూఢిల్లీ:** సిపిఎం 24వ అఖిల భారత మహాసభలో ఎన్నికైన పార్టీ కేంద్ర కమిటీ ఈ నెల 3-5తేదీల్లో మొదటిసారిగా హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో సమావేశమైంది. ఇటీవల ఉగ్రదాడుల్లో, ఈశాన్య ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదల్లో, బెంగళూరులోని తొక్కిసలాటలో మరణించిన వారికి కేంద్ర కమిటీ సంతాపం తెలియచేసింది. పలు రాజకీయ పరిణామాలపై చర్చించిన అనంతరం కేంద్ర కమిటీ ఈ కింది ప్రకటన విడుదల చేసింది.

**గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ**

గాజా, దాని అనుబంధ ప్రాంతాలను పూర్తిగా నాశనం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను కేంద్ర కమిటీ ఖండించింది. బిజెపి ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు ఆయుధాల ఎగుమతిని తక్షణమే ఆపాలి. ఆ దేశంతో సైనిక, భద్రతా సంబంధాలను తెంచుకోవాలి. పాలస్తీనా ప్రయోజనాల కోసం ప్రభుత్వం దృఢంగా నిలబడాలి. మన సంఘీభావాన్ని పునరుద్ఘాటించాలి. రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమన్న మన దీర్ఘకాలిక విదేశాంగ విధాన వైఖరికి కట్టుబడి ఉండాలి.

**పహల్గాం ఉగ్రదాడులు, ఆ తర్వాత**

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని ఖండించడంలో యావత్ దేశ ప్రజలు ఏకతాటిపై నిలబడ్డారని కేంద్ర కమిటీ పేర్కొంది. ఇందులో, జమ్మూ కాశ్మీర్ ప్రజల స్పందన అద్భుతం, ఆదర్శప్రాయం. ఉగ్రవాదుల హింసకు నిరసనగా వారు స్వచ్ఛందంగా అప్పటికప్పుడు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియచేశారు. అయితే, హిందూత్వ శక్తులు, ప్రజల ఈ సమైక్య సంకల్పానికి పూర్తి విరుద్ధంగా హేయమైన ఆ ఉగ్రదాడిని ముస్లింలపైన, కాశ్మీరీలపైన విద్వేషప్రచారం చేపట్టడానికి ఉపయోగించుకోజూశాయి.

ఆపరేషన్ సిందూర్ తర్వాత, ప్రధాని, బిజెపి ఈ మిలటరీ ఆపరేషన్‌ను సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని చూశారు. ఎన్నికల ప్రయోజనాల కోసం కూడా దీనిని ఉపయోగించుకోడానికి ప్రయత్నించారనడానికి బీహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో ప్రధాని మోడీ చేసిన ప్రసంగాలే తిరుగులేని తార్కాణం.

ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాల్సిన అనేక తీవ్రమైన ప్రశ్నలు వున్నాయి. 370వ అధికరణను, ప్రత్యేక హోదాను రద్దు చేసిన తర్వాత, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో పరిస్థితులు ఎలా సాధారణ స్థితికి వచ్చాయో ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. ఇటువంటి లోప భూయిష్టమైన వైఖరే తీవ్రమైన భద్రతా లోపాలు, లొసుగులకు దారి తీస్తోంది. ఉగ్రదాడులకు పాల్పడిన వారిని గుర్తించారు, కానీ ఇంకా వారిని పట్టుకోలేదు. ఈ వైఫల్యాలకు బాధ్యులు, జవాబుదారీ ఎవరో ముందుగా నిర్ధారించాలి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొన డంలో మొదటి పాఠం ఏమిటంటే.. ప్రజా ఐక్యతను నిర్మించడం, అవసరమైన భద్రతా చర్యలను బలోపేతం చేయడం, అన్ని లొసుగులు, లోపాలను సరిదిద్ది ప్రజల ప్రాణాలను కాపాడడం.

మే 10న కాల్పుల విరమణ ప్రకటించిన తీరుపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అమెరికా జోక్యం చేసుకుని, భారత్, పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించేలా చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతూ వస్తున్నారు. కానీ దీన్ని ఇంతవరకు సమర్ధవంతంగా తిప్పికొట్టే యత్నం చేయలేదు. ఇందుకు సంబంధించి అమెరికా జోక్యం ఏ రీతిలో ఉన్నా సిపిఎం కేంద్ర కమిటీ దాన్ని గట్టిగా తిరస్కరిస్తున్నది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య సమస్యల పరిష్కారంలో అటువంటి విదేశీ జోక్యమనేది మన దేశ రాజకీయ ఏకాభిప్రాయానికి పూర్తి వ్యతిరేకం.

ఉగ్ర దాడులు, తదనంతర పరిణామాలకు సంబంధించిన అన్ని అంశాలను చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని యావత్ ప్రతిపక్షమూ డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం తిరస్కరించడాన్ని కేంద్ర కమిటీ ఖండించింది. పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి బదులు రాజకీయ లబ్ధి కోసం ప్రధాని దేశమంతా పర్యటిస్తూ ఓ రకమైన యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టే యత్నం చేశారు. ఆపరేషన్ విజయవంతమైందని, దాని లక్ష్యాలు పూర్తిగా సాధించామని ప్రభుత్వం ప్రకటించుకుంది. కానీ, ప్రధాని మోడీ తాను వెళ్ళిన చోటల్లా ప్రసంగిస్తూ, ఆపరేషన్‌ను ప్రస్తుతానికి నిలుపుచేశామే తప్ప పూర్తిగా ఆపేయలేదని చెబుతు న్నారు. దీనివల్ల ఈ ఆపరేషన్‌ను తన పార్టీ రాజకీయ ప్రాజెక్టుగా ఉపయోగించుకోవాలన్నదే ఆయన ఉద్దేశమని స్పష్టమవుతున్నది.

ఉగ్రవాదాన్ని అణచి వేయడానికి సైనిక మార్గాలు మాత్రమే ఏకైక పరిష్కారం కాదని సిపిఎం ఎల్లప్పుడూ చెబుతునే వస్తోంది. తీవ్రవాదంపై పోరాడేందుకు దౌత్య, రాజకీయ, ఇతర రకాల చర్యలను కూడా అనుసరించాల్సి వుంది. ప్రధాని ప్రకటించిన కొత్త సిద్ధాంతం ఈ మార్గాలన్నింటినీ ముందుగానే మూసివేస్తుంది. ఈ వైఖరి యుద్ధోన్మాదానికి ఆజ్యం పోస్తుంది. సరిహద్దుకు ఇరువైపులా గల తీవ్రవాద శక్తులను బలోపేతం చేసేందుకు దారి తీస్తుంది. మత పరమైన విభజనను మరింత పెంచుతుంది.

**మతోన్మాద పోకడలు, విద్వేష ప్రచారం :**

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తమ మతోన్మాద ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నాయి. మైనారిటీలపై విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. బాధితుల కుటుంబ సభ్యులను, ఆర్మీ ప్రతినిధిని, విదేశాంగ కార్యదర్శిని ట్రోలింగ్ చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం గమ్మున ఉంది. తద్వారా విద్వేష ప్రచారానికి తన రహస్య తోడ్పాటును అందిస్తున్నది. ప్రధాన స్రవంతిలోని కార్పొరేట్ మీడియాకు చెందిన ఒక పెద్ద సెక్షన్ కూడా ఈ యుద్ధోన్మాదానికి బాకా పట్టింది. మతోన్మాద విషాన్ని చిమ్ముతూ మన దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించింది. మరోవైపు, విమర్శనాత్మక గొంతులను మూయించేందుకు ప్రభుత్వం పోలీసు, దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపింది. అటువంటి దాడులు ప్రభుత్వ నయా ఫాసిస్ట్ స్వభావాన్ని తెలియచేస్తాయి.

వలస వచ్చిన ముస్లింలు ముఖ్యంగా బెంగాలీ మాట్లాడేవారిని బంగ్లాదేశీయులుగా చూస్తూ వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారిని బలవంతంగా తరలిస్తు న్నారు. బిజెపి మంత్రులు, నేతలు అత్యంత దారుణమైన రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఉగ్రదాడులతో, మతో న్మాద విద్వేషంతో యావత్ దేశం కల్లోలపడుతుంటే, బిజెపి ప్రభుత్వం మాత్రం తన ఆశ్రిత పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చేలా తన నయా ఉదారవాద విధానాలను మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్లోంది. ప్రజల మధ్య చీలిక తెచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి అనుసరిస్తున్న ఈ మతోన్మాద విధానాలు ప్రజల దృష్టిని మళ్లించడానికి ఉద్దేశించ బడ్డాయి. ప్రజా ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి, వారి జీవనోపాధిపై దాడిని కొనసాగించడమే వాటి ఉద్దేశం.

**ఈశాన్యంలో వరదలు :** ఈశాన్య రాష్ట్రాల్లో అకాల వర్షాలు, వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ,ఆస్తి నష్టం సంభవించింది. . 36మందికి పైగా మరణించారు. 5లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి, తగిన రీతిలో సహాయ, పునరావాస చర్యలు చేపట్టేలా చూడాలి.

గాజాపై ఇజ్రాయిల్ ఊచకోతకు నిరసనగా యావత్ పార్టీ తక్షణమే నిరసనలు, ఆందోళనలు చేపట్టాలి. ప్రజాస్వామ్యానికి మద్దతుగా, ఎమర్జన్సీ ప్రకటనకు 50ఏళ్ళ పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రస్తుత ప్రభుత్వ నిరంకుశవాదాన్ని ఎండగడుతూ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఎమర్జన్సీ సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ బూటకపు పాత్రను బహిర్గతం చేసేందుకు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవాలి.

పార్టీ నిర్మాణపరమైన అంశాలపై కూడా చర్చించి, కేంద్ర కమిటీ కొన్ని నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర కార్యదర్శివర్గాన్ని ఏర్పాటు చేసింది. అందులో ఎం.ఎ.బేబీ, బి.వి.రాఘవులు, మురళీధరన్, రాజేంద్ర శర్మ, కె.హేమలత, విక్రమ్ సింగ్, కె.ఎన్.ఉమేష్‌లు వున్నారు.

### జులై 9న సార్వత్రిక సమ్మెకు మద్దతు

కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన జులై 9 నాటి సార్వత్రిక సమ్మెకు కేంద్ర కమిటీ పూర్తిగా మద్దతును ఇస్తోంది. అదే రోజు, రైతు, వ్యవసాయ కార్మికులు కూడా తమ డిమాండ్లపై నిరసనలు నిర్వహిస్తున్నారు. సమ్మెను విజయవంతం చేయడానికి చురుకుగా ప్రచారం చేయాల్సిందిగా పార్టీ శాఖలకు, సభ్యులకు పిలుపునిచ్చింది.

### సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు తలొగ్గడమే

ఈ ఏడాది చివరిలోగా అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)పై సంతకం చేయాలన్నది భారత ప్రభుత్వ లక్ష్యంగా వుంది. జులైలోగా, తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు అనుగుణంగా వివిధ వస్తువులపై సుంకాలు తగ్గించడానికి ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించింది. ప్రతిపాదిత ద్వైపాక్షిక ఒప్పందం ( బిటిఎ) భారత రైతాంగం జీవనోపాధులకు ముప్పుగా పరిణమించనుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఇ) ను, ఔషధ రంగాన్ని అత్యంత దారుణంగా దెబ్బ తీయనుంది. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతున్నా భారత్‌లో ఎలాన్ మస్క్ స్టార్ లింక్ ఉపగ్రహ ఇంటర్‌నెట్ సేవలను అందించడాన్ని ఆమోదించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుంది. బ్రిటన్‌తో ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) ప్రభుత్వం కుదుర్చుకుంది. ఇంకా ఇలాంటి ఒప్పందాలు చాలా జరగబోతున్నాయి. ఈ ఒప్పందాలన్నీ కూడా పారదర్శకంగా లేవు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేవు, ఆందోళనలు అసలే లేవు.

భారత కార్మిక వర్గం, ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీపడే ఇటువంటి ఒప్పందాలన్నింటినీ కేంద్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

### భవిష్యత్ పిలుపులు

ఉగ్రవాదానికి, యుద్ధోన్మాదానికి, పహల్గాం ఉగ్ర దాడిని ఉపయోగించి మతోన్మాద విద్వేషాన్ని వ్యాప్తి చేసే యత్నాలకు వ్యతిరేకంగా జూన్‌లో వారం రోజుల పాటు ప్రచారోద్యం చేపట్టాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం జూన్ 10-11 తేదీల్లో కాశ్మీర్‌లో పర్యటించనుంది. ఈ ప్రతినిధి బృందంలో సభ్యులు : పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపి (లోక్‌సభ) అమ్రారామ్, ఎంపి, కేంద్ర కమిటీ సభ్యులు కె.రాధాకృష్ణన్, ఎంపి(రాజ్యసభ), కేంద్ర కమిటీకి ఆహ్వానితులు జాన్ బ్రిట్టాస్, ఎంపి (రాజ్యసభ) వికాశ్ రంజన్ భట్టాచార్య, ఎంపి(లోక్‌సభ) సు వెంకటేశన్, ఎంపి(రాజ్యసభ) ఎ.ఎ.రహీమ్ ఉంటారు.

### భారతదేశ ఆర్థికవ్యవస్థ వాస్తవిక ముఖ చిత్రం

మన ఆర్థిక పరిస్థితి వాస్తవికతను ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే కప్పిపెడుతోంది. ఈ ఏడాది చివరినాటికి జపాన్‌ను భారత ఆర్థిక వ్యవస్థ అధిగమించబోతోందని, నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందని అదే పనిగా ఊదరగొడుతోంది. భారత్, జపాన్ మధ్య తలసరి ఆదాయాల్లో భారీగా వున్న తేడా వంటి వాస్తవాలను దాచిపెడుతూ ఈ ప్రచారం సాగుతోంది. పెరుగుతున్న అసమానతలు, కార్మికుల జీవనోపాధుల సంక్షోభం వంటివి మన ఆర్థిక వ్యవస్థలో గల వాస్తవిక అంశాలు, వీవాటిని బయటపెట్టాల్సిన అవసరం వుంది.

### సాధారణ జనగణన, కుల గణన

ఉద్దేశ్యపూర్వకంగా, అసాధారణ రీతిలో జాప్యం జరిగిన అనంతరం 2027 లో సాధారణ జనగణన నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఎట్టకేలకు ప్రకటించాల్సి వచ్చింది. దానితో పాటు కులగణన కూడా చేపట్టనున్నట్లు పేర్కొంది. ఇందుకు గానూ అనుసరించాలనుకుంటున్న పద్ధతుల గురించి, ప్రభుత్వ ఉద్దేశ్యాల గురించి వివిధ భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే అఖిల పక్షం ఏర్పాటు చేసి ఈ అంశాలన్నింటినీ చర్చించాలి.

**ఎన్నికలు :** ఈ ఏడాది అక్టోబరులో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి వుంది. బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించేందుకై సంయుక్తంగా కృషి చేసేందుకు బీహార్‌లో వామపక్ష, లౌకిక ప్రతిపక్ష పార్టీలతో సిపిఎం చర్చలు ప్రారంభించింది.

### కీలక రంగాల ప్రైవేటీకరణ

అణు విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేటీకరించి, విదేశీ ఆపరేటర్లను అనుమతించడానికి ప్రభుత్వం అంగీకరించింది. అమెరికా అణు రియాక్టర్ తయారీదారులు ప్రవేశించడానికి వెసులుబాటు కల్పిస్తూ భారతీయుల భద్రతను పణంగా పెట్టి అణు పరిహార బాధ్యత క్లాజును సవరించడానికి ప్రభుత్వం అంగీకరించింది. మొట్టమొదటి సారిగా, యుద్ధ విమానాల ఉత్పత్తిని ప్రైవేట్ కార్పొరేషన్లకు అప్పగిస్తున్నారు. రక్షణ, గనుల తవ్వకాలు, అణు విద్యుత్ వంటి కీలక రంగాలను ప్రైవేటీకరించడమంటే మన సార్వభౌమాధికారం, భద్రతలపై దాడి చేయడమే అవుతుంది.

### గవర్నర్ల అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పు

గవర్నర్ల అధికారాలపై, రాష్ట్రాల శాసనసభల సంకల్పాన్ని గౌరవించడంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఈ తీర్పుపై రాష్ట్రపతి నివేదన పేరుతో సుప్రీం కోర్టుకు పలు ప్రశ్నలను సంధించారు. ఇది బిజెపి నిరంకుశవాద వైఖరిని ప్రతిబింబిస్తోంది. ఇది సమాఖ్యవాదం సూత్రాలను ధిక్కరించడమే.

## నిరసన చేయడం పౌరుడి హక్కు!

### మద్రాసు హైకోర్టు

**చెన్నై :** నిరసన చేయడం ప్రతి ఒక్క పౌరుడి హక్కు అని, చట్ట ప్రకారం చేపట్టాల్సి వుందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. నిబంధనలను ఉల్లంఘించి నిరసనలు చేస్తున్న జాక్టో - జిఇఓ (తమిళనాడు ఉపాధ్యాయుల సంఘం, ప్రభుత్వ ఉద్యోగుల స ంఘం సంయుక్త కార్యాచరణ మండలి ) సభ్యులను నిలువరిసూ ఆదేశాలు జారీ చేయాలని, ఒకవేళ వారు నిరసనలు చేపడితే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరిలో బి.రామ్‌కుమార్ ఆదిత్యన్ అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ వేశారు. సమ్మెల్లో లేదా ఆందోళనల్లో పాల్గొనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఈ పిటిషన్‌పై ఆదేశాలు ఇవ్వలేమని జస్టిస్ సుబ్రమణియం, జస్టిస్ మరియా క్లాటెలతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. సమ్మె లేదా ఆందోళన చేపట్టేటప్పుడు సంబంధిత అధికారుల నుండి అనుమతి తీసుకోవాల్సి వుందని, ఆ సమయంలో ఏ వ్యక్తి అయినా అక్రమాలు, అవకతవకలకు పాల్పడితే అప్పుడు చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. పిటిషన్‌లో కోరినట్లుగా చేయడం సాధ్యం కాదని పేర్కొంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

## త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు

- మార్క్‌ఫెడ్ ఎమ్‌డి మంజీర్ జిలానీ

**ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)**

రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును త్వరలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ ఎండి మంజీర్ జిలానీ తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా పర్చూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని గోడౌన్లను శుక్రవారం ఆయన సందర్శించారు. గోదాముల సామర్థ్యం, పొగాకు నిల్వకు సంబంధించి గోదాముల్లోని సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంకొల్లు, వంకాయలపాడు, మార్టూరులోని గోదాములను పరిశీలించారు. గోదాములు సరిపోని పక్షంలో ప్రైవేట్ గోదాములు లీజుకు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ, ఆర్‌డిఒ పి.గ్లోరియా, తహశీల్దార్ బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.



ఎంఎంసిలోని గోదామును పరిశీలిస్తున్న జిలానీ



సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, నాయకులతో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ బృందం

## వియత్నాం-భారత్ మధ్య సత్సంబంధాలు

- సిపిఎం కార్యాలయాన్ని సందర్శించిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

వియత్నాం-భారత్ మధ్య మంచి సంబంధాలున్నాయని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ బృందం పేర్కొంది. ఆ సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సి ఉందని తెలిపింది. శుక్రవారం నాడిక్కడ సిపిఎం కేంద్ర కార్యాలయాన్ని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిటికల్ బ్యూరో సభ్యులు న్గుయెన్ ట్రోంగ్ న్ఘియా, కేంద్ర కమిటీ సభ్యులు ఎన్గో డాంగ్ హై, న్గుయెన్ థాన్ న్ఘి, లే హై బిన్, బ్రిగేడియర్ జనరల్ ఫామ్ న్గోక్ ఫువాంగ్, కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ న్గుయెన్ వాన్ డక్, సెంట్రల్ కమిషన్ ఫర్ పబ్లిసిటీ డో ఫువాంగ్ థావో, విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ స్పెషలిస్ట్ న్గుయెన్ ట్రోంగ్ కీన్, విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రొటోకాల్ అధికారి ఫామ్ జువాన్ నామ్, విదేశాంగ మంత్రిత్వశాఖ సభ్యులు లూరు అన్హ తువాన్, లెఫ్టినెంట్ కల్నల్ హోంగ్ ట్రోంగ్ కీన్‌లతో కూడిన బృందం సందర్శించింది. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ అరుణ్ కుమార్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్, రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్‌ను కలిశారు.

ఈ సందర్భంగా రెండు పార్టీల నేతల మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను, రెండు దేశాల ప్రజల మధ్యకు తీసుకెళ్లేలా కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రజల మధ్య సంబంధాలను బలపడేలా చూడాలని పేర్కొన్నారు. సిపిఎం, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ మధ్య ఎప్పటి నుంచో దగ్గర సంబంధాలు ఉన్నాయని, వియత్నాం విముక్తి పోరాట సమయంలో సిపిఎం అందించిన మద్దతును, ప్రజలను సమీకరించడంలో సిపిఎం చొరవను తాము మర్చిపోమని వియత్నాం బృందం పేర్కొంది. వియత్నాం 8 శాతం జిడిపితో అభివృద్ధి పదంలో నడుస్తోందని, పేదరికం నానాటికి తగ్గుతుందని తెలిపింది. జనవరిలో తమ పార్టీ 14వ మహాసభ జరగనుందని, ఈ మహాసభలో వియత్నాం అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొంది. ఆ మహాసభ నిర్ణయాలను సిపిఎంతో కూడా పంచుకుంటామని తెలిపింది. కేరళలో సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని వియత్నాం బృందం తెలిపింది.

### ముగిసిన 'నవత' వ్యవస్థాపకులు

## కోటేశ్వరరావు అంత్యక్రియలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకుల్లో ఒకరైన పర్వతనేని వెంకట కోటేశ్వరరావు అంత్యక్రియలు శుక్రవారం ఉదయం జరిగాయి. అంతకు ముందు ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం క్రీస్తురాజపురంలోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. కోటేశ్వరరావు భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళు లర్పించారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ జడ్‌పి చైర్‌పర్సన్ గద్దె అనురాధ, సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ, చంద్రరావు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు పి.లక్ష్మణరావు, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం కృష్ణలంక స్వర్గపురి వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అక్కడ ఆయన కుమారుడు సుధీర్ అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్వతనేని కోటేశ్వరరావు మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి రవాణా రంగానికి తీరనిలోటని పేర్కొన్నారు.



కోటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు

### గవర్నర్ల తీరు రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్ర కమిటీ సమావేశం నిర్ణయించిందని ఎంఎ బేబీ ప్రకటించారు. అత్యవసర పరిస్థితి సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుసరించిన ద్వంద్వ ప్రమాణాలను బహిర్గతం చేయడానికి కూడా ఈ కార్యక్రమాలు ఉపయోగించబడతాయన్నారు. సిపిఎం అత్యవసర పరిస్థితిని బహిరంగంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను జైలులో పెట్టి, పోలీసులు దారుణంగా కొట్టారన్నారు. పోలీసుల దెబ్బల తర్వాత, ఆయన చేతిలో రక్తంతో తడిసిన చొక్కాతో అసెంబ్లీకి వచ్చి ప్రసంగించారని గుర్తు చేశారు. అప్పట్లో ఇది చాలా చర్చనీయాంశమైందన్నారు. ఆయనతోపాటు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనకు నాయకత్వం వహించిన ఇతరులను కూడా జైలులో పెట్టారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన కొంతమంది సభ్యులను కూడా జైలులో పెట్టారని, కానీ వారు తరువాత బయటకు వచ్చి ఇందిరా గాంధీ పాలనకు మద్దతు ప్రకటించారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ దేవరస్ ఇందిరా గాంధీ 20 సూత్రాల కార్యక్రమానికి మాత్రమే కాకుండా సంజయ్ గాంధీ ఐదు సూత్రాల కార్యక్రమానికి కూడా మద్దతు తెలిపారని ఎంఎ బేబీ గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతుందని, అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

### 'బనకచర్ల'కు హ్యామ్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని ఆదేశించారు. కృష్ణాగోదావరి డెల్టాలో సరైన సమయంలో పంటలసాగు చేపట్టేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జలవనరుల సమర్థ వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూడు పంటలు 365 రోజులు పచ్చగా ఉండేలా చూడాలని తెలిపారు. 8 నుండి 20 మీటర్ల లోపు భూగర్భజలాలు ఉన్న మండలాల వివరాలు అందించాలని, జలాలు తగ్గకుండా చూడాలని చెప్పారు. దీనిపై బేసిన్లు, జిల్లాల వారీగా బులెటిన్లు విడుదల చేయాలని సూచించారు. సీలేరు నీరు కృష్ణాడెల్టాకు అందించే అంశాన్ని పరిశీలించాలని, హంద్రీ, నీవా మెయిన్ కెనాల్ వెడల్పు పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. వెలిగొండ స్టేజ్-1 పనులు 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుడమేరులో పూడికతీత, ముళ్లకంపలు తొలగించాలన్నారు.

**ఈ ఏడాది చివరికి డయాఫ్రం వాల్**

పోలవరం ప్రాజెక్టు సివిల్ నిర్మాణ పనులు ఇప్పటి వరకూ 81.70 శాతం పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి వాల్ నిర్మాణం పూర్తవుతుందని సిఎం పేర్కొన్నారు. డయాఫ్రం వాల్ పనులు 64 వాతం, బట్రెస్ డ్యామ్ 91 శాతం, వైబ్రో కంప్రాక్షన్ 54 శాతం పనులు జరగాయని సిఎం తెలిపారు. ప్రాజెక్టు పనులు అనుకున్న సమయానికల్లా పూర్తి చేసేలా కంట్రాక్టర్లతో చర్చించాలని సిఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాదు, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశభూషణ్‌కుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సిఎం కార్యదర్శి రాజమౌళి, ఐటిశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, సిసిఎల్‌ఏ జయలక్ష్మి పాల్గొన్నారు.

**KAKINADA MUNICIPAL CORPORATION**
**'e' PROCUREMENT NOTIFICATION**

**Roc No. 2908/2025/E4,** **Dated: 05-06-2025**

Tenders invited through ap e procurement platform for 04 works with an estimated amount value of **Rs. 4,57,73,246/-** from the eligible contractors in the following manner.

**Two Works for an amount of Rs. 14,94,533/-**
Last date and time for downloading bid documents : Dt.16-06-2025 upto 10-00 AM
Last date and time for submission of bids : Dt. 16-06-2025 upto 10-30 AM

**Two Works for an amount of Rs. 4,42,78,713/-**
Last date and time for downloading bid documents : Dt.24-06-2025 upto 10-00 AM
Last date and time for submission of bids : Dt.24-06-2025 upto 10-30 AM

*Tender Inviting Authority:*
**Commissioner, Municipal Corporation, Kakinada**
Mail: kkd_mplcorp@yahoo.com
Call Centre Phone: 0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- **BHAWNA,** I.A.S.,
Commissioner
Municipal Corporation, Kakinada

**జీవన సౌరభం**

శరీరం బలహీన పడినప్పుడు అసూయలాంటి వ్యాధులు మరింత పెరుగుతాయి.

**మీ కోసం**

నిమ్మకాయ రసం ఎక్కువగా రావాలంటే, నిమ్మకాయలను కాసేపు పెనంపై పెట్టి వేడిచేసి పిండితే ఎక్కువ రసం వస్తుంది.





# టక్కు నిక్కుల సోకు



స్రవంతి గారాల తనయుడు అభినవ్. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఒకరోజు స్రవంతి తోటకూర పప్పు, క్యారెట్ కూర వండి అభినవ్‌కి వడ్డించింది. 'నాకు ఆకు కూరలు, క్యారెట్ సహించవు నేను తినను' అంటూ మారాం చేశాడు అభినవ్. అక్కడే ఉన్న తాతయ్య అదంతా విన్నాడు. 'ఇష్టమున్నా లేకున్నా అన్ని కూరలు తినాలి. చేదుగా ఉన్నా కాకరకాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఆకు కూరలు, క్యారెట్ తినకపోవడం వల్ల ఒంట్లో ఐరన్, కాల్షియం తగ్గి రక్తహీనత ఏర్పడుతుంది. అంతే కాదు కంటి చూపు తగ్గి 'ముక్కు మీద కెక్కు, రెండు చెవులు నొక్కు, టక్కు నిక్కుల సోకు, జారిదంటే పుటుక్కు' వాడవలసి ఉంటుంది' అన్నాడు తాతయ్య.

'అంటే ఏంటి తాతయ్యా?' అని అడిగాడు అభినవ్. 'ఆలోచించి చెప్పు' అన్నాడు తాతయ్య. 'తెలిసింది.. తెలిసింది. టక్కు.. నిక్కు.. అంటే టానిక్కు, పుటుక్కు అంటే కిందపడితే పగిలిపోతుందని' అన్నాడు అభినవ్.

తాతయ్య నవ్వుతూ అది కాదు, 'ఆలోచించు సరియైన జవాబు దొరుకుతుంది' అన్నాడు. 'మాత్రలు తాతయ్యా' అన్నాడు ఈసారి అభినవ్. అప్పుడు కూడా తాతయ్య కాదని తలూపుతూ,

'అమ్మా స్రవంతి! 'టక్కు నిక్కుల సోకు, ముక్కు మీద కెక్కు, రెండు చెవులు నొక్కు, జారిదంటే పుటుక్కు' ఎక్కడ పెట్టానో గుర్తులేదు. వెతికి తీసుకురా! న్యూస్ పేపర్ చదవాలి' అన్నాడు.

'అలాగే' అని చెప్పి వెతికి మామగారికి ఇచ్చింది స్రవంతి. అది పెట్టుకుని చక్కగా న్యూస్ పేపర్ చదివాడు తాతయ్య. 'ఓహో అదా! ఇప్పుడు నాకు తెలిసిపోయింది. నువ్వు చెప్పిన దానికి జవాబు కళ్ళజోడు తాతయ్యా' అన్నాడు అభినవ్.

'నేను ముసలి వాడిని అయ్యాక చత్వారానికి కళ్లద్దాలు వాడుతున్నాను. నువ్వు ఆకు కూరలు, క్యారెట్ తినకపోతే చూపు మందగిస్తుంది. ఇప్పటి నుంచే కళ్లద్దాలు వాడవలసి వస్తుంది' అని చెప్పాడు తాతయ్య.

'అమ్మో కళ్ళజోడు నాకొద్దు, ఈ రోజు నుంచి అన్ని కూరలు తింటాను తాతయ్యా' అని బుద్ధిగా అమ్మ వండిన తోట కూర పప్పు, క్యారెట్ కూర తిన్నాడు అభినవ్.

**- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445.**

## నేను గీసిన బొమ్మ



గుడ్ల అక్షర, 6వ తరగతి, శ్రీ శంకర స్కూల్, నిజాంపేట, మెదక్ జిల్లా.




## చుక్కలు కలపండి



పిల్లలూ, ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

# టాక్సిన్స్‌ను ఇలా బయటికి పంపొచ్చు..

**ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో మురికి ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవాలి. అంటే టాక్సిన్స్ బయటకు వెళ్ళాలి. వీటిని వదిలించుకోవాలంటే ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. వంటింట్లో దొరికే కొన్ని రకాల పదార్థాలతో తయారుచేసిన కషాయాలు ప్రతి రోజూ తాగితే శరీరంలోని ట్యాక్సిన్స్ బయటికి పోతాయి.**

**జీలకర్రతో..**

వారంలో మొదటి రోజు జీలకర్ర, ధనియాలు, సోంపుతో కషాయం తయారు చేసుకోవాలి. ఓ టేబుల్ స్పూన్ జీలకర్ర, ఓ టేబుల్ స్పూన్ ధనియాలు, ఓ టేబుల్ స్పూన్ సోంపు తీసుకోవాలి. రెండు కప్పుల నీళ్లలో వీటిని వేయాలి. దాదాపు 5 నిముషాల పాటు బాగా మరిగించాలి. ఆ తర్వాత వడబోసి ఈ నీళ్లు తాగాలి. జీర్ణ సమస్యలను తగ్గించే డ్రింక్ ఇది. మొత్తం టాక్సిన్స్ అన్నీ ఒక్కసారిగా బయటకు వెళ్లిపోతాయి. ఉదయమే తాగితే ఇంకా రిఫ్రెషింగ్‌గా ఉంటుంది.

**వేపాకుతో..**

వేపాకులో ఉన్నన్ని ఔషధాలు మరి వేటిలో ఉండవు. ఓ 5 వేపాకులు, దీంతో పాటు పావు టేబుల్ స్పూన్ పసుపు, ఓ గ్లాసు నీళ్లు తీసుకుని బాగా మరిగించాలి. ఆ మరిగిన నీళ్లలో పసుపు, వేపాకులు వేయాలి. ఈ నీళ్లని వడపోసి తాగాలి. అయితే.. వేపాకులను ముందురోజు రాత్రి నానబెట్టుకోవాలి. ఆ తర్వాత వాడాలి. ఉదయం పరగడుపున ఈ కషాయం తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. చర్మ సమస్యలు తగ్గిపోతాయి. ముఖ్యంగా లివర్ పనితీరు మెరుగు పడుతుంది. రెండో రోజు ఈ కషాయం తీసుకో వాలి.

**బూడిద గుమ్మడితో..**

బూడిద గుమ్మడి కాయతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఈ కషాయాన్ని వారంలో మూడోరోజు తీసుకోవాలి. ఈ కషాయం వల్ల శరీరం డీహైడ్రేట్‌కాకుండా ఉంటుంది. శరీరాన్ని పూర్తిగా డిటాక్స్ చేయడంలో ఇది బాగా తోడ్పడుతుంది. ఓ కప్పు బూడిద గుమ్మడి కాయ ముక్కలను తీసుకోవాలి. బూడిద గుమ్మడి కాయ ముక్కలను మిక్సీ పట్టుకుని.. ఆ నీళ్లని వడబోయాలి. ఆ రసంలో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. చివర్లో చిటికెడు రాక్ సాల్ట్ కలుపుకుని ఉదయం పూట తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.



**త్రిఫల చూర్ణంతో..**

త్రిఫల కషాయం 4వ రోజు తీసుకుంటే పొట్ట మొత్తం క్లీన్ అయిపోతుంది. త్రిఫల అంటే ఉసిరి, కరక్కాయ, తానికాయతో తయారు చేసింది. త్రిఫల చూర్ణం మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వాళ్లకి ఇది బాగా పని చేస్తుంది. అర టేబుల్ స్పూన్ త్రిఫల చూర్ణంలో ఓ టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ఓ గ్లాసు గోరువెచ్చని నీళ్లలో మిక్స్ చేయాలి. ఉదయం తాగితే బరువు కంట్రోల్‌లో ఉండడంతో పాటు జీర్ణ సమస్యలు కూడా క్రమంగా తగ్గుతాయి. కడుపు పూర్తిగా శుభ్రమైపోతుంది.

**అల్లం, తులసితో..**

అల్లం, తులసి డిటాక్స్ డ్రింక్ చాలా మంచిది. దీంతో ఇమ్యూనిటీ పెరగడంతో పాటు మెటబాలిజం మెరుగవుతుంది. ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి. మలబద్ధకం కూడా తొలగిపోతుంది. ముందు 5 తులసి ఆకులు తీసుకోవాలి. దీంతో పాటుగా ఓ చిన్న అల్లం ముక్క, అర టేబుల్ స్పూన్ నల్ల మిరియాలు తీసుకోవాలి. రెండు కప్పుల నీళ్లలో వీటిని వేసి బాగా మరిగించాలి. దాదాపు పది నిమిషాల పాటు అలాగే ఉంచాలి. బాగా మరిగిన తర్వాత వడబోసి కాస్త గోరు వెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. ఈ కషాయం ఐదో రోజు తీసుకోవాలి.

**తిప్పతీగతో..**

తిప్పతీగకు ఆయుర్వేదంలో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఇది ఎలాంటి సమస్యలనైనా ఔషధంగా పనిచేస్తుంది. బాడీ డిటాక్స్ చేయడంలోనూ ఇది మంచి ఆప్షన్. ఓ టేబుల్ స్పూన్ తిప్పతీగ పొడిని తీసుకోవాలి. లేదా తిప్పతీగ కాండం అయినా వాడుకోవచ్చు. ఓ గ్లాసు నీళ్లను గిన్నెలో పోసి బాగా మరిగించాలి. నీళ్లు మరిగే టైమ్‌లో ఈ పొడిని అందులో వేయాలి. కనీసం పది నిముషాల పాటు మరిగించి తర్వాత వడబోసి ఈ నీళ్లు తాగాలి. వారంలో ఆరో రోజు దీన్ని సిద్ధం చేసుకోవాలి.

**మునగాకుతో..**

వారంలో ఏడో రోజు మునగాకుకు ప్రాధాన్యం ఇవ్వాలి. మునగాకులో ఎన్నో లాభాలున్నాయి. ఓ టేబుల్ స్పూన్ మునగాకు పొడితో బాడీ డిటాక్స్ అవుతుంది. ముందు ఓ గ్లాస్ నీళ్లు బాగా మరిగించాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు మునగాకు పొడి, నిమ్మరసం కలపాలి. 5 నిముషాల పాటు మరిగించాలి. మునగాకు తాజాగా ఉండేలా చూసుకోవాలి. ఈ రసాన్ని వడబోసి ఉదయమే తీసుకుంటే శరీరంలో ఉండే మలినాలు బయటకు వెళ్లిపోతాయి.

## కుండని ఇలా శుభ్రం చేద్దాం..



మంచినీళ్ల కోసం కుండని వాడే వాళ్లు ఆశించే ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే కొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. మట్టికుండను కొన్న తర్వాత బాగా కడిగి, ఎండలో తడి ఆరిపోయేంత వరకు ఉంచాలని సూచిస్తున్నారు. కుండలో మంచినీళ్లు పోసిన తర్వాత ఇరవై నాలుగు గంటల్లోపు మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఎందుకంటే, సాధారణ ఉష్ణోగ్రత వద్ద బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది.

కుండలో పోసిన నీళ్లు 24 గంటల కంటే ఎక్కువగా నిల్వ ఉంటే తాగకూడదు. తప్పకుండా ఆ నీటిని పారబోసి కుండను శుభ్రంగా కడగాలి.

నిల్వనీటిలో పెరిగే బ్యాక్టీరియా, ఆల్గే (నాచు వంటి సూక్ష్మజీవులు) కుండకు కూడా అంటుకుని ఉంటాయి. అవి పోయేందుకు గండ్ర ఉప్పుతో రుద్దాలి.

కడిగేందుకు సాఫ్ట్‌గా ఉండే పీచు, గోరువెచ్చని నీటిని వాడాలి. ఇలా చేయడం వల్ల నీటిలో ఉండే రసాయనాలను మట్టికుండ గ్రహిస్తుంది. నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయి.

వారానికి ఒకసారి నిమ్మరసంతో ఉప్పు లేదా బేకింగ్ సోడా కలిపి కడిగితే కుండలో ఉండే బ్యాక్టీరియా, ఆల్గేని పూర్తిగా తొలగించవచ్చు.

## ఉప్పుతో తుప్పును ఇలా వదిలించండి..

ఉప్పు వంటకు రుచిని అందించడమే కాదు, ఇంటికి శుభ్రతనూ తీసుకొస్తుంది. మరకలు, చెడువాసనలను తొలగించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది. ముఖ్యంగా.. ఇనుప సామగ్రికి పట్టిన తుప్పును వదలగొట్టడంలో ఉప్పు చాలా ప్రయోజనకారి.

ఐరన్ కడాయిలు ఎక్కువ రోజులు వాడకుండా ఉంటే, తుప్పుపట్టి పోతాయి. తిరిగి వాడేటప్పుడు నానా తంటాలు పడాల్సి వస్తుంది.

అలాంటప్పుడు తుప్పు పట్టిన ఐరన్ కడాయిలపై కొద్దిగా ఉప్పు నీటితో స్ప్రే చేసి, 10-15 నిమిషాలు అలాగే ఉంచాలి. ఆ తర్వాత తడివస్త్రంతో తుడిచేస్తే తుప్పు వదిలిపోతుంది.



వంటపాత్రలపై జిడ్డు, ఆహారపు మచ్చలను ఉప్పు ఇట్టే పోగొట్టేస్తుంది. ఆయా పాత్రల్లో కొద్దిగా ఉప్పు, నీళ్లు పోసి కొన్ని నిమిషాలు అలాగే వదిలేయాలి. ఆ తర్వాత నీటితో కడిగి తుడిచేస్తే జిడ్డు పోతుంది.

సింక్‌లో ఆహార వ్యర్థాలు మిగిలిన చోట దుర్వాసన వ్యాపిస్తుంది. ఈ సమస్యకు ఉప్పునీరు బాగా పనిచేస్తుంది. సింక్‌పైన కొంత ఉప్పు చల్లి, ఆపై చల్లని నీళ్లు పోసి కడిగేస్తే ఫలితం కనిపిస్తుంది. మరకలు తొలగిపోవడమే కాదు, సింక్‌లో దుర్వాసన కూడా తగ్గిపోతుంది.

ఉల్లి, వెల్లుల్లి లాంటివి కట్ చేసిన తర్వాత.. చేతులకు ఘాటైన వాసన అంటుకుంటుంది. చాలాసేపటి వరకూ ఆ వాసన వస్తూనే ఉంటుంది. ఉప్పు నీటితో చేతులను కడిగేస్తే ఆ వాసనలు దూరమవుతాయి. ఇల్లు తుడిచే నీటిలో కొద్దిగా ఉప్పు కలిపితే మరింత శుభ్రంగా మారుతుంది.

ఉప్పు నీటితో తుడవడం వల్ల దుర్వాసన కూడా తగ్గుతుంది.

## వేడుకగా అఖిల్ పెళ్లి



శుక్రవారం తెల్లవారుజామున అఖిల్ అక్కినేని వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీని ఆయన వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న ఈ వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ఢిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్‌లోనూ ఆమె ఆర్టిస్ట్‌గా రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్‌తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది.

## 22న 'జననాయకన్' టీజర్ విడుదల



కోలీవుడ్ కథానాయకుడు దళపతి విజయ్ నటిస్తున్న సినిమా 'జననాయకన్'. హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజాహెగ్డే కథానాయిక. ఈ చిత్రానికి సంబంధించి గ్రిప్పింగ్స్ ఇప్పటికే విడుదలై సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ చిత్ర టీజర్‌ను విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సినిమాలో విజయ్ పోలీస్ అధికారిగా నటిస్తున్నారు. ఓటీటీ హక్కులను ఒక సంస్థ భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 2026లో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా జననాయకన్ చిత్ర షఉటింగ్ ఇటీవల పూర్తయ్యింది. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులందరికీ విందును ఇచ్చిన విజయ్ భావోద్రేకానికి గురైనట్లు సమాచారం. అప్పట్లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఎంజీఆర్ నటించిన చివరి చిత్రం మదురై మీట్ట సుందరపాండియన్. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. జననాయకన్ చిత్రం విజయ్ జీవితాన్ని ఎలా మారుస్తుందో అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. గతేడాదిలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన విజయ్ రానున్న శాసనసభ ఎన్నికల్లో (2026) పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో జననాయకన్ తన చివరి చిత్రమని ఆయనే స్వయంగా ప్రకటించారు.

# కెఎల్ రాహుల్ శతకం

- జురెల్ అర్ధసెంచరీ
- ఇండియా-ఎ 221/3
- ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికారిక టెస్ట్



కెఎల్ రాహుల్ (116 పరుగులు)



ధృవ్ జురెల్ (52 పరుగులు)

**నార్తంప్టన్:** ఇంగ్లండ్ లయన్స్‌తో జరుగుతున్న రెండో, చివరి అనధికారిక టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ కెఎల్ రాహుల్ శతకానికి తోడు.. వికెట్ కీపర్ ధృవ్ జురెల్ అర్ధసెంచరీతో కదం తొక్కారు. కరణ్ నాయర్(40) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో తొలిరోజు కడపటి వార్తలందే సమయానికి భారత్-ఎ జట్టు 70 ఓవర్లలో 5వికట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. టీ విరామ సమయానికి 52ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 221 పరుగులతో పటిష్టంగా ఉన్న భారతజట్టు టీ విరామం అనంతరం వరుసగా రెండు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎకు శుభారంభం దక్కలేదు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(17) నిరాశపరిచాడు. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్(93) సెంచరీతో మెరిసినా.. మరోవైపు కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(11) కూడా నిరాశపరిచాడు. ఆ తర్వాత కరణ్ నాయర్ వికెట్ కూడా కోల్పోయి భారతజట్టు ఒక దశలో 126పరుగులకే 3వికెట్లు చేజార్చుకొని కష్టాల్లో పడింది. వోక్స్ ఓ అద్భుతమైన బంతితో కరుణ్‌ను 40 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఎల్బీడబ్ల్యూ చేశాడు. కరుణ్ ఔటయ్యాక రాహుల్ ధవ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. తొలి టెస్ట్‌లో రెండు అర్ధ సెంచరీలతో సత్తా చాటిన జురెల్.. టీ విరామం తర్వాత కెఎల్ రాహుల్(103), ధృవ్ జురెల్(52) సెంచరీ, అర్ధసెంచరీలను పూర్తి చేసుకొని మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. ఈ మ్యాచ్‌లో భారత-ఏ జట్టు ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ 168 బంతుల్లో 15ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 116 పరుగులు చేసి జార్జి హిల్ బౌలింగ్‌లో ఎమీలే గేకు క్యాచ్ ఇచ్చి పెవీలియన్‌కు చేరాడు. మరోవైపు జురెల్ 87బంతుల్లో 7ఫోర్ల సాయంతో 52పరుగులు కొట్టాడు. జార్జి హిల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యి పెవీలియన్‌కు చేరాడు. ఇంగ్లండ్ బౌలర్లు క్రిస్ వోక్స్‌కు మూడు, జార్జి హిల్‌కు రెండు వికెట్లు దక్కాయి.

**సర్ఫరాజ్, ముఖేష్ ఔట్..**

ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్‌కు అవకాశం ఇచ్చేందుకు గత మ్యాచ్‌లో సత్తా చాటిన సర్ఫరాజ్ ఖాన్‌ను తప్పించారు. సర్ఫరాజ్ తొలి అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో 92 పరుగులు చేశాడు. రాహుల్ ఓపెనర్‌గా రావడంతో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ మూడో స్థానానికి డిమోట్ అయ్యాడు. బౌలింగ్ విభాగంలోనూ ఒక మార్పు జరిగింది. తొలి మ్యాచ్‌లో 3 వికెట్లు తీసిన ముకేశ్ కుమార్ స్థానంలో ఖలీల్ అహ్మద్, హర్ష్ దూబే స్థానంలో తనుశ్ కోటియన్ తుది జట్టులోకి వచ్చారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

- 14 రోజుల అనంతరం ఏ క్షణమైనా సమ్మె
- ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ శాఖకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సమ్మె నోటీసు అందించింది. తాడేపల్లిలోని సిడిఎంఎ కార్యాలయంలో డైరెక్టర్ సంపత్ కుమార్ పేషీ అధికారులకు, ఫెడరేషన్ (ఇంజినీరింగ్ విభాగం) రాష్ట్ర కన్వీనర్ బి ముత్యాలరావు, కో కన్వీనర్ జ్యోతిబసు తదితరులు సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ నెల 6 నుంచి 14 రోజుల అనంతరం ఏ రోజు నుంచి అయినా రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజినీరిగ్ కార్మికులకు జిఓ 11 ఆధారంగా కేటగిరీలు నిర్ణయించడం, జిఓ 36 ప్రకారం జీతాలు రూ.21 వేల నుంచి రూ.24,500లకు పెంచి చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. జిఓ 1615లో పేర్కొన్న విధంగా మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు పిఆర్‌సి, జీతాలు, కరువు భత్యం, ఐఆర్ చెల్లించాలన్నారు. గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా పెంపు, దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లింపు, సంక్షేమ పథకాలు అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలని నోటీసులో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఇంజినీరింగ్ సెక్షన్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 13 వేల మంది కార్మికులు తమ నైపుణ్యానికి తగిన జీతాలు అందక అర్ధాకలితో గడుపుతున్నారని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు పరిష్కారం కోసం ఆరేళ్లుగా ప్రభుత్వాలకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచడంతోపాటు, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రజలకు, పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను నివారించాలని నోటీసులో పేర్కొన్నారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో ఫెడరేషన్ నాయకులు వి చిన్న, పి డేవిడ్, వి సైదులు, ఎస్ దాసు తదితరులు ఉన్నారు.



## 'హరిహర వీరమల్లు' మళ్లీ వాయిదా

'హరి హర వీరమల్లు' సినిమాను ఈనెల 12న మీ ముందుకు తీసుకురావడానికి ఎంతగానో ప్రయత్నించినప్పటికీ అది కుదర్లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాయిదా వేయక తప్పడం లేదు. మరింత గొప్పగా మలచాలన్నదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. దీనికోసమే మరికాస్త సమయం అవసరమవుతోంది. అందరి ఎదురు చూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం. ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. త్వరలో ట్రైలర్‌తోపాటు కొత్త విడుదల తేదీ ప్రకటిస్తాం' అని సినీ నిర్మాత ఎఎంరత్నం వెల్లడించారు. పవన్‌కళ్యాణ్, నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. అనేకసార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా ఈనెల 12న విడుదలవుతుందని అభిమానులు వేచిచూశారు. ఈ సినిమాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. కీరవాణి సంగీతాన్ని అందించారు.

# ఫైనల్‌కు అల్కరాజ్

- సెమీస్‌లో మసెట్టిపై గెలుపు



**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో అల్కరాజ్ 8వ సీడ్, ఇటలీకి చెందిన మసెట్టిపై విజయం సాధించాడు. తొలిసెట్‌ను 4-6తో కోల్పోయిన అల్కరాజ్.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్‌లను చేజిక్కించుకొన్నాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 4-6, 7-6(7-3), 6-0, 2-0తో ముగించాడు. మూడో సెట్‌ను అల్కరాజ్ 6-0తో చేజిక్కించుకున్నా.. మసెట్టి గాయపడ్డాడు. అల్కరాజ్ నాల్గో సెట్‌లో 2-0తో ఆధిక్యతలో ఉన్న దశలో మసెట్టి మ్యాచ్ నుంచి వైదొలిగాడు. దీంతో అల్కరాజ్‌ను విజేతగా ప్రకటించారు. టాప్‌సీడ్ సిన్నర్-జకోవిచ్‌ల మధ్య రెండో సెమీస్ జరగనుంది.

### నేడు మహిళల సింగిల్స్ టైటిల్ పోరు..



రొలాండ్ గారోస్‌లో శనివారం మహిళల సింగిల్స్ టైటిల్ పోరు జరగనుంది. టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, 2వ సీడ్, అమెరికా సంచలనం కోకా గాఫ్‌ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. సెమీస్‌లో గాఫ్ 6-7(6-8), 6-4, 6-1తో కీస్‌పై విజయం సాధించగా.. సబలెంక 7-6(7-1), 4-6, 6-0తో 5వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్‌ను చిత్తుచేసి టైటిల్ పోరుకు సిద్ధమైంది. సబలెంక కెరీర్‌లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను చేజిక్కించుకోగా.. గాఫ్ 2022 ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్. 2023లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ యుఎస్ ఓపెన్‌ను చేజిక్కించుకొని అద్భుత ఫామ్‌లో ఉంది.

# క్రికెట్‌కు పియూష్ చావ్లా గుడ్‌బై



**ముంబయి:** అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు పియూష్ చావ్లా(38) ప్రకటించాడు. అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు చావ్లా ట్విటర్ ఎక్స్‌లో శుక్రవారం వెల్లడించాడు. క్రికెట్‌లో కొనసాగే క్రమంలో తనకు మద్దతుగా నిలిచిన కోచ్‌లు, కుటుంబ సభ్యులు, సహచర ఆటగాళ్లు, క్రికెట్ సంస్థలతోపాటు ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాడు. రెండు దశాబ్దాలకు పైగా మైదానంలో గడిపాను. అందమైన ఆటకు వీడ్కోలు పలకాల్సిన సమయం ఆసన్నమైంది' అని తెలిపాడు. 2006-2012మధ్య భారతజట్టుకు ఆడిన చావ్లా.. కెరీర్‌లో మూడు టెస్ట్‌లు, 25 వన్డేలతోపాటు మరో 7టి20లు ఆడాడు. లెగ్ స్పిన్నర్ అయిన చావ్లా.. మూడు ఫార్మాట్‌లలో కలిపి 43 వికెట్లు పడగొట్టాడు. దేశవాళీ, ఫస్ట్‌క్లాస్ క్రికెట్ 137మ్యాచుల్లో కలిపి 446వికెట్లు పడగొట్టిన చావ్లా.. ఐపిఎల్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌తోపాటు, ముంబయి ఇండియన్స్‌లకు ఆడిన చావ్లా.. 192మ్యాచుల్లో 192వికెట్లు పడగొట్టాడు. ఐపిఎల్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితాలో చావ్లా మూడోస్థానంలో ఉన్నాడు. 2014లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐపిఎల్ ట్రోఫీ చేజిక్కించుకున్న జట్టులో సభ్యుడు. 2007లో భారతజట్టు టి20 ప్రపంచకప్, 2011లో ఐసిసి వన్డే ప్రపంచకప్ గెలిచిన భారతజట్టు చావ్లా కూడా ఉన్నాడు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484, and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, Postal Registration No:ATP/86/2024-2026, RNI Regd .No. APTEL/2019/78422